

ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-పాడేరు:అల్లూరి జిల్లా పాడేరులో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మోదమంబ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రభు ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నుకున్నారు..ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రభు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యను వ్యాపారంగా మార్చేశాయని విమర్శించారు. రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలో అదనంగా ఫీజులు పెంచారని విమర్శించారు.ఈ కారణంగానే గిరిజన ప్రాంతంలో విద్యార్థులు చదువుకు దూరం అయ్యే ప్రమాదం ఉందని చెప్పారు. మండల కమిటీలో 17 మందిని నియమించినట్లు తెలిపారు. మండల కార్యదర్శిగా సాయికుమార్, మండల అధ్యక్షులుగా ప్రేమ్ కుమార్, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులుగా గణేష్, కవిత ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు చిన్నారావు, నరేష్, మత్స్యరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదివాసీ సంబరాలు ప్రారంభం

-పాడేరులో థింసా కళాకారులతో ఊరేగింపు - ఆదివాసీ హక్కులను పరిరక్షించుకుందాం : అప్పలనర్స

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో పలు చోట్ల అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవ సంబరాలు మంగళవారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆదివాసీ గిరిజన సంఘం జెండాలను ఆవిష్కరించారు.

పాడేరు: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా హక్కుల దినంగా నిర్వహించాలని ఆదివాసీ గిరిజన సంఘం పిలుపు మేరకు మంగళవారం పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి శ్రీ మోదకొండమ్మ ఓపెన్ ఆడిటోరియం వరకు ధింసా కళాకారులతో ఊరేగింపు నిర్వహించారు. ఈనెల 1నుండి 10 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆదివాసీ గిరిజన సంఘం ఆదివాసీ హక్కుల దినంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహిస్తుంది. ఈ మేరకు పాడేరు లో మంగళవారం నిర్వహిస్తున్న ఆదివాసీ హక్కుల దినం కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన ఆదివాసీ సంస్కృతిక కార్యక్రమాన్ని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర నేత పి.అప్పలనర్స, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఐ.కొండలరావు తుడుము వాయిస్తూ ప్రారంభించారు. ఈ సందర్భంగా అప్పలనర్స మాట్లాడుతూ, ఆదివాసీ హక్కుల రక్షణకై ప్రభుత్వాలు కృషి చేయాలని, ఆదివాసీ గ్రామ అధికారాన్ని ప్రభుత్వం అమలు చేయడంతోనే ప్రభుత్వంపై ఆదివాసులకు విశ్వాసం కలుగుతుందన్నారు. అనంతరం డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కార్యదర్శి ఎస్. ధర్మానపడాల్, పి బల్ దేవ్, జిల్లా ఉపాధ్యక్షులు ఎల్ సుందర్ రావు, పి. లక్కు, కె.సత్యనారాయణ, సోమేలి చిట్టిబాబు, ఆదివాసీ సాంస్కృతిక కళావేదిక జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జోషి, కృష్ణారావు, సివిల్ రైట్స్ నాయకులు ఎస్.నాగరాజు, ఎస్ఎఫ్ఐ నేతలు చిన్నారావు, నరేష్ పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న అప్పలనర్స, నాయకులు

పాడేరులో ముమ్మర ఏర్పాట్లు

ప్రజాశక్తి-పాడేరు:ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి ఐటిడిఎ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసారు. స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయం ఎదురుగా ఉన్న వి.ఆర్ కళ్యాణ మండపం లో ఈనెల 9న ఉదయం 10.30 గంటలకు ఆదివాసీ దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నారు. జిల్లా ఇన్చార్జి మంత్రి గుడివాడ అమర్నాథ్, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, అరకు పార్లమెంటు సభ్యురాలు జి.మాధవి, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు జె. సుభద్ర, పాడేరు ఎంఎల్ ఎ. కె.భాగ్యలక్ష్మి, అరకు శాసన సభ్యులు చెట్టి ఫాల్గుణ తదితరులు పాల్గొంటారని ఐటిడిఏ అధికారులు తెలిపారు. ఆదివాసీ వేడుకలలో భాగంగా ఐటిడిఏ లబ్ధిదారులకు 85 సవర్ వీడర్లు, 10 పసుపు ఉడికించే యంత్రాలు, 10 పాలిషర్లు లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు.



సభా ప్రాంగణం

చట్టాలు పటిష్టంగా అమలు చేయాలి

పాడేరు : ప్రధాని మోడీ, సిఎం జగన్ లు గిరిజన చట్టాలు, హక్కులను పటిష్టంగా అమలు చేయాలని గిరిజన సంఘం అల్లూరి సీతారామరాజు జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్ డిమాండ్ చేశారు. మంగళవారం చింతపల్లి మండల కేంద్రం వద్ద హనుమాన్ జంక్షన్ కూడలిలో ఆ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రపంచ ఆదివాసుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్ఎఫ్ఐ, గిరిజన సంఘం సంయుక్తంగా గిరిజన సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అసాంఘిక శక్తులు కుల, మత విద్వేషాలు రెచ్చ గొట్టి దేశవ్యాప్తంగా గిరిజనులపై, గిరిజన మహిళలపై తీవ్రమైన దాడి జరుగుతుంటే ఇప్పటికీ ఏ రకమైన చర్యలు చేపట్టలేదన్నారు. ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి సాగిన చిరంజీవి,



పాడేరులో థింసా నృత్యం చేస్తున్న మహిళలు



జెండాలను ఎగురవేస్తున్న నాయకులు

నాయకులు కీల్లో సింహాచలం, మజ్జి రాంబాబు, విద్యార్థి సంఘం నాయకులు పాంగి జీవన్ కృష్ణ, కొర్ర కార్తీక్ పాల్గొన్నారు.

డుంబ్రిగుడ:ఈనెల 9న బుధవారం జరగనున్న అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవాన్ని అత్యంత ఘనంగా జరుపుకోవాలని మానవ హక్కుల నేర నిరోధక సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కె కృష్ణకుమారి ఆదివాసులకు పిలుపునిచ్చారు. ఆదివాసుల సాంస్కృతి సంప్రదాయాలతో పాటు కట్టు బోట్టు, ఆచార వ్యవహారాలను బాహ్య ప్రపంచానికి చాటి చెప్పాలన్నారు.

ఆదివాసీ గిరిజన సంఘం జెండా ఆవిష్కరణలు

మారేడుమిల్లి:ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వారోత్సవాలు సందర్భంగా ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జెండాలను ఆ సంఘం నాయకులు వై.రామవరం మండలం రాములకొండ, కప్పల బంధ, దబ్బమామిడి గ్రామాల్లో గిరిజనులు సమక్షంలో ఎగరవేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు కె.శాంతిరాజు మాట్లాడుతూ, అడవులపై ఆదివాసీలు పోరాడి సాధించుకున్న హక్కులను తొలగించి కార్పొరేట్ కంపెనీలకు బిజెపి ప్రవేశం కల్పిస్తుందన్నారు. స్వాతంత్ర్యం వచ్చి నేటికి 76 ఏళ్ళు దాటినా ఆదివాసీలకు తిండి విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు లేక దుర్భర జీవితాలను అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనేతరులైన బోయవాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చి రాజకీయ లబ్ధి పొందేందుకు కేంద్ర బీజేపీ, రాష్ట్ర వైసిపి ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండలం కార్యదర్శి గడుతూరి మల్లిఖర్జున రావు, నాయకులు పి.లింగారెడ్డి, గిరిజనులు పాల్గొన్నారు.

సీలేరు : జీకే వీధి మండలం గుమ్మరేవుల పంచాయతీ నేలజర్త గ్రామంలో ఆదివాసీ నాయకులు కోడా ఆనంద్, గణేశ్వరరావు, మార్కరాజు ఆధ్వర్యంలో ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించారు. గిరిజనులు తమ సంప్రదాయాలకు అద్దంపట్టేలా నడుముకు ఆకులు కట్టుకొని, విల్లంబుల చేతబట్టి జై ఆదివాసీ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు సుంకర విష్ణుమూర్తి, మాజీ సర్పంచ్ ఏసు వరరాజు పాల్గొన్నారు.



ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం, వార్డెన్‌తో మాట్లాడుతున్న గిరిజన సంఘం నేతలు

గిరిజన హాస్టళ్లలో హెల్త్ వాలంటీర్లు, ఎఎన్ఎంలను నియమించాలి

-మృతి చెందిన గిరిజన విద్యార్థిని కుటుంబానికి గిరిజన సంఘం నేతల పరామర్శ

ప్రజాశక్తి-మారేడుమిల్లి

గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో హెల్త్ వాలంటీర్లు, ఎఎన్ఎంలను తక్షణమే నియమించాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కె.శాంతిరాజు, గడుతూరి మల్లిఖర్జునరావు డిమాండ్ చేశారు. వై.రామవరం మండలం, రేగడిపాలెం గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థిని రాకోట భానుశ్రీ (11) అనారోగ్యంతో మృతి చెండగా, ఆమె తల్లిదండ్రులను మంగళవారం సంఘం నాయకులు పరామర్శించారు. అనంతరం దాలిపాడు గిరిజన ఆశ్రమ పాఠశాలకు వెళ్లి పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎమ్, వార్డెన్‌లను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాలిపాడు గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఆరోవ తరగతి చదువుతున్న భానుశ్రీ అనారోగ్యానికి గురికాగా, పాఠశాల అధికారులు చవిటిదిబ్బలు పిహెచ్‌సికి తీసుకువెళ్లి చూపించారని, అనంతరం భానుశ్రీని తల్లిదండ్రులు ఇంటికి తీసుకెళ్లారని తెలిపారు. కొద్ది రోజులకే శనివారం రేగడిపాలెంలో తమ ఇంటివద్ద మృతి చెందన్నారు. ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో హెల్త్ వాలంటీర్లు, ఎఎన్ఎమ్‌లు లేకపోవడంతో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి విషమించే వరకు ఎటువంటి వైద్య సేవలు అందడం లేదని, వారు ఉంటే ఎప్పటికప్పుడు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులు తెలుసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించి తక్షణమే హెల్త్ వాలంటీర్లు, ఎఎన్ఎమ్‌లను నియమించాలని డిమాండ్ చేశారు.

సీలేరులో రాజకీయ పార్టీల బ్యానర్లు తొలగింపు

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం సీలేరు మేజరు పంచాయతీ సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల కావడంతో ఎలక్షన్ కోడ్ ఆఫ్ కండక్ట్‌లో భాగంగా అన్ని రాజకీయ పార్టీల బ్యానర్లు, ఫ్లెక్సీలను పంచాయతీ సిబ్బంది మంగళవారం తొలగించారు. ఎన్నికల స్టేజ్ వన్ అధికారిగా నియమితులైన జీకే వీధి ఇఓపిఆర్‌డి పాపారావు ఎన్నికల నోటిఫికేషన్ అతికించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ తొలిరోజు ఎటువంటి నామినేషన్లు నమోదు కాలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ ప్రకాష్, మహిళా పోలీస్ రేవతి, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ కుసుమ తదితరులు పాల్గొన్నారు.



నోటిఫికేషన్ ప్రదర్శిస్తున్న అధికారులు

వీఆర్ఎల సమస్యలపై పోరాటం ఉధృతం

-సిఐటియు జిల్లా అధ్యక్షులు చిన్నయ్య పడాల్- నిరసన దీక్ష విరమణ

ప్రజాశక్తి-పాడేరు:గ్రామ రెవెన్యూ సహాయకుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించేందుకు ప్రభుత్వం దిగి రాకపోతే చలో విజయవాడ కార్యక్రమం చేపడతామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ హెచ్చరించారు. గ్రామ సేవకుల సంఘం పాడేరు ఐటీడీఏ ఎదుట చేపట్టిన 36 గంటల నిరసన దీక్షను మంగళవారం ఆయన వీఆర్ఏలకు నిమ్మరసం ఇచ్చి విరమింప చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ రెవెన్యూ సేవకుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారంపై తక్షణమే స్పందించకుంటే ఈ పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం గ్రామ సేవకు లను చిన్నచూపు చూస్తుందని మండిపడ్డారు. వీఆర్ఏలకు ఉద్యోగ భద్రత లేదన్నారు. జీతాల పెంపుదల, పే స్కేల్ అమలు, నామిని వీఆర్ఏలకు ఉద్యోగ అవకాశం, అర్హులైన వీఆర్ఏలకు ప్రమోషన్లు కల్పించడంపై జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పట్టించుకోలేదని మండిపడ్డారు. అనంతరం ఐటీడీఏ నుంచి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వరకు వీఆర్ఏలు ర్యాలీ నిర్వహించారు. తమ సమస్యలపై జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు. బి కొండబాబు, పూర్ణ చంద్రశేఖర్, . డివిజన్ కమిటీ కార్యదర్శి వి సుభద్ర, ప్రెసిడెంట్ కే కళ్యాణం, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్యామసుందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ నరాజి అప్పారావు, దేవిక, అప్పారావు, గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ప్రతినిధులు, వీఆర్ఏలు పాల్గొన్నారు.



వీఆర్ఎలకు నిమ్మరసం ఇస్తున్న చిన్నయ్యపడాల్




మొక్కలు నాటుతున్న జెడ్‌పిటిసి గంగరాజు

కాఫీ నిధుల మంజూరుకు కృషి

- జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి-అనంతగిరి:అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీలో కాఫీ నిధుల మంజూరు, రైతులకు ప్రోత్సాహకాలు అందేవిదంగా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని జెడ్పీటీసీ గంగరాజు తెలిపారు. మండలంలోని ఎగువశోభ పంచాయతీ బీసుపురంలో మంగళవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జడ్పిటిసి గంగరాజు మాట్లాడుతూ, బీసుపురం గ్రామంలో ఏడుగురు రైతులకు మొక్కలు పంపిణీ చేసి నాటించడం జరిగిందన్నారు.ఐటిడిఏ నుండి నిధులు విడుదల చేయకపోవడంతో కాఫీ రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.2021 నుండి రైతులకు ప్రోత్సహం అందకపోవడంతో చేతి పెట్టుబడి చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఐటిడిఏ పరిధిలో పెండింగ్‌లో రూ 5 కోట్ల బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎగువశోభ సర్పంచ్ కొర్ర.సింహాద్రి, మండల ఆర్టీ కల్చరల్ అధికారి జె. ఈశ్వరరావు, లైజన్ వర్కర్లు సీతారామ్, అప్పన్న పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న కాంతారావు

పథకాలు అమలు చేయకుంటే చర్యలు

- ఆహార కమిషన్ సభ్యులు కాంతారావు

ప్రజాశక్తి-పాడేరు:కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను తప్పు తోవ పట్టించినా, సక్రమంగా అమలు చేయకపోయినా భాధ్యులపై చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు బి.కాంతారావు హెచ్చరించారు. మంగళవారం జిల్లా పర్యటనలో భాగంగా పాడేరు మండలంలో పలు ప్రాంతాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన సభ్యులు మాట్లాడుతూ, పిల్లల జ్ఞాపక శక్తి పెంపొందించడానికి ఫోర్టిఫైడ్ బియ్యం సరఫరా చేస్తున్నట్లు గుర్తు చేసారు. ఎండియు వాహనంలో స్టాక్‌లో అవకతవకలు ఉన్నట్లు గుర్తించిన సభ్యులు ఆపరేటర్‌కు మెమో జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. గుడివాడ2 అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించిన సభ్యులు స్టాక్ వివరాలు వెల్లడించడంలో లోపాలను గుర్తించి సంబంధిత టీచర్‌కు మెమో జారీ చేయాలని ఆదేశించారు. సుండ్రుపుట్టు అంగన్వాడీ కేంద్రంలో పిల్లల హాజరు పట్టిలో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండడంతో సదరు టీచర్ కు కూడా మెమో జారీ చేయాలని ఆదేశించారు. పాడేరు ప్రభుత్వ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సరఫరా అధికారి పి.వి. శ్యాం కుమార్, గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు కొండలరావు, ఎటిడబ్ల్యుఒ రజని, ఐసిడిఎస్ పిడి ఎన్.సూర్యలక్ష్మి, సిడిపిఒ ఝాన్సి పాల్గొన్నారు.

నిర్వాసితులను నిరాశ పర్చిన సిఎం సభ

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు పూనెం సత్యనారాయణ

ప్రజాశక్తి-విఆర్.పురం

కూనవరంలో సోమవారం జరిగిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పర్యటన నిర్వాసితులను తీవ్ర నిరాశపర్చిందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ అన్నారు. మండలంలోని రేఖపల్లి సిపిఎం కార్యాలయంలో మంగళవారం జరిగిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడిన విధానం సరిగా లేదని, కేంద్రం ప్రభుత్వం డబ్బులిస్తే తప్ప తనేమీ చేయలేనని చేతులు ఎత్తేసినట్లు ఉందని పేర్కొన్నారు. గతంలో ఎన్నికల ముందు కేంద్రం మేడలు వంచుతా.. ఆర్‌ఆర్ ప్యాకేజీ రూ.10 లక్షలు ఇస్తా.. గతంలో రూ.లక్షా 15వేలు ఇచ్చిన భూములకు రూ.5 లక్షలు ఇస్తా అని చెప్పి ప్రజల్ని నమ్మించి, ఇప్పుడు కేంద్రం మీద నెట్టడం ఏమిటని ప్రశ్నించారు. సిఎం సభలో పెయిడ్ ఆర్టిస్టులను పెట్టి అసలు సమస్యలు మాట్లాడకుండా భజన చేయించి ముఖ్యమంత్రినే తప్పుదోవ పట్టించారని మండిపడ్డారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు వడ్లాది రమేష్, గుండుపూడి లక్ష్మణ్, పంకు సత్తిబాబు, పోడియం.శ్రీరామ్మూర్తి, సోడి మల్లయ్య, నాల్లారపు ప్రకాష్, సిరపు తాతబాబు పాల్గొన్నారు.

మళ్లీ మోసం చేసిన ముఖ్యమంత్రి

కూనవరం : గోదావరి వరద బాధితులను పరామర్శించేందుకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇక్కడి ప్రజలను మళ్లీ మోసం చేసి వెళ్ళారని సిపిఎం జిల్లా నాయకులు నాగేశ్వరరావు అన్నారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆవుల ఉపేంద్రరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎం రాక సందర్భంగా ప్రతిపక్ష నాయకులను అర్ధరాత్రి అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. ప్రజలు సిఎం సభకు రాకుండా బారికేడ్లుతో అడ్డుకోవడం సమంజసం కాదని, రాబోయే ఎన్నికల్లోనూ ముఖ్యమంత్రి సభలను ఈ బారికేడ్లు నిర్మించే నిర్వహిస్తారా? అని ప్రశ్నించారు. ముంపునకు గురయ్యే ప్రతి నిర్వాసితుడికీ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆవుల మురళి, కర్నాటి శ్రీనివాసరావు, పాయం సత్యనారాయణ, తాళ్లూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గిరిజనులకు ఒరిగిందేమీ లేదు : గిరిజన సంఘం

కూనవరం : ముఖ్యమంత్రి పర్యటన వల్ల ఈ ప్రాంత ప్రజలకు ఒరిగిందేమీ లేదని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య అన్నారు. మంగళవారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజన చట్టాలు అమలు చేయాలని ముఖ్యమంత్రిని కోరాలని ఆదివాసీలు అనుకున్నా, ఆ అవకాశం ఇవ్వలేదని, కనీసం గిరిజనులైన వైసిపి సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలు, ఎంపిపిలైనా గిరిజన చట్టాలు కాపాడాలని ముఖ్యమంత్రికి విన్నవించలేదని విమర్శించారు. వరద సహాయం అందకపోయినా అందినట్టు ముఖ్యమంత్రిని పొగడటం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, ఎంపీటీసీ కారం జయసుధ, సర్పంచులు నాగమణి, బి.వెంకమ్మ, సోడే శంకర్ పాల్గొన్నారు.

కేంద్రంపై నెట్టేయడం సమంజసం కాదు : టిడిపి

కూనవరం : పోలవరం నిర్వాసితులకు కేంద్ర ప్రభుత్వం ఇస్తే ప్యాకేజీ ఇస్తామని ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వం మీద నెట్టేయటం ఎంతవరకు సమంజసమని టిడిపి మండల అధ్యక్షులు భరపాటి ప్రకాష్ ప్రశ్నించారు. మెజారిటీ ఎంపీలను ఇస్తే కేంద్రం మెడలు వంచి పోలవరం ప్యాకేజీ తెస్తానని గత ఎన్నికల్లో చెప్పిన జగన్, ఎంపీలున్నా కేంద్ర మెదలు ఎందుకు వంచడం లేదని ప్రశ్నించారు. 41 కాంటూరులో ఉన్న వాళ్లకు ఆరేడు నెలల్లో ప్యాకేజీ ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి, ఈ లోగా రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని, ఎన్నికల కోడ్ వల్లే ప్యాకేజీ ఇవ్వడం కుదరలేదని మరో సారి మోసం చేయడానికే జగన్‌రెడ్డి పథకం వేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ సోడే రామయ్య, గడ్డిపాటి ప్రసాద్, ఎండి షరీఫ్, శివయ్య, నోమల సత్యనారాయణ, భీష్మచారి పాల్గొన్నారు.

రహదారి సౌకర్యం లేని నిమ్మలగొంది

తీవ్ర ఇబ్బందులు పడుతున్న స్థానికులు

ప్రజాశక్తి-కొయ్యూరు


మండలంలోని మర్రివాడ పంచాయతీ నిమ్మలగొంది గ్రామానికి నేటికీ రహదారి సౌకర్యం లేదు. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనారోగ్యం చేసినా, గర్భిణుల ప్రసవ సమయంలోనూ డోలిమోతలే వీరికి దిక్కు. అత్యవసర సమయాల్లోనూ నానా అవస్థలు పడుతున్నారు. ఇటీవల ఉపాధి హామీ అధికారులు నిమ్మలగొంది గ్రామస్తులకు కొబ్బరి, మామిడి తదితర మొక్కలు పంపిణీ చేశారు. గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో లబ్ధిదారులు ఆ మొక్కలు మోసుకొని కాలినడకన గ్రామానికి తీసుకెళ్లారు. రహదారి సౌకర్యం కల్పించాలని అనేక సార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు స్థానికులు విన్నవించుకున్నా పట్టించుకున్న నాధుడే లేడు. జికె.వీధి మండలంలో కొకితపాడు గ్రామం వరకూ 5 కిలో మీటర్ల మేర రహదారి నిర్మిస్తే తమ కష్టాలు తీరతాయని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మట్టి పర్రాట్లుకు ట్రాక్టర్‌తో దున్నిన దృశ్యం

వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి- పెదబయలు:లింగేటి పంచాయతీ లింగేటి గ్రామంలోని ఉప ఆరోగ్య కేంద్రంలో ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంపును వైద్యాధికారి చంద్రశేఖర్ చైతన్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆస్పత్రుల్లో మంచానికి పరిమితమైన ఇద్దరు రోగులను వారి ఇంటి వద్దకే వైద్య సిబ్బంది వెళ్లి చికిత్స చేసి మందులను అందించారు.ఏపిడమిక్ సీజన్ కావడంతో రోగాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి చైతన్య అన్నారు. మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి విష జ్వరాలు రాకుండా చుట్టుపక్కల ప్రదేశాలు శుభ్రపరుచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది విజయలక్ష్మి, మాధవి, సలోమీ, 104 సిబ్బంది అజిత్, సూర్యనారాయణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



తనిఖీ చేస్తున్న ఎంఇఒ

పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి- పెదబయలు : బొంగరం పంచాయతీ వంచుర్గా ఎంపిపి ప్రాథమిక పాఠశాలను మంగళవారం స్థానిక విద్యాశాఖాధికారి కొమ్ము కృష్ణమూర్తి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రహదారి సౌకర్యం లేకపోవడంతో కాసేపు నడకన వెళ్లారు. పాఠశాలలో నోట్ పుస్తకాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు విధులకు డుమ్మా కొడితే చర్యలు తప్పవన్నారు.

నైపుణ్యాలు అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి-విశాఖపట్నం : మీడియా రంగంలో చోటుచేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంపొందించుకోవాలని ఎయు వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి సూచించారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం జర్నలిజం విభాగం విద్యార్థులతో మంగళవారం తన కార్యాలయంలో మాట్లాడారు. జర్నలిజం కోర్సు పూర్తిచేసే నాటికి జ్ఞానంతో పాటు ప్రత్యక్ష అవగాహన కలిగి ఉండాలన్నారు. జర్నలిజం పూర్తిచేసిన విద్యార్థులు స్టార్టప్ సంస్థలను ప్రారంభిస్తే తాము అవకాశం ఇస్తామన్నారు. ఎయూ స్టార్టప్ ఇంక్యుబేషన్ సెంటర్‌లో వీరికి అవసరమైన వసతులు కల్పించి, మార్గదర్శకం అందిస్తామని చెప్పారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న ఎయూ లుక్స్ సంచికల రూపకల్పనలో జర్నలిజం విద్యార్థులు భాగం కావాలని సూచించారు. త్వరలో వంద సంవత్సరాల వేడుకను జరుపుకుంటున్న ఆంధ్రవిశ్వవిద్యాలయంలో యువత భాగస్వామ్యం పెంచే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి ప్రత్యక్షంగా ఎయు కళాశాలలు, విద్యార్థులు, పూర్వవిద్యార్థులకు సంబంధించిన ఆసక్తికరమైన ప్రత్యేక కథనాలను అందించాలని సూచించారు. విదేశీ విద్యార్థుల భాగస్వామ్యం సైతం దీనిలో స్వీకరిస్తామన్నారు. ఎయు లుక్స్ తెలుగు, ఆంగ్ల వార్తాపత్రికలను వేలాది మంది పూర్వవిద్యార్థులకు చేరుస్తున్నామని తెలిపారు. దీనిని ఆకర్షణీయంగా, ఉన్నత ప్రమాణాలతో తీర్చిదిద్దే బాధ్యతను అందరూ స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ సివిఎం.వినయకుమార్, మీడియా రిలేషన్స్ డీన్ ఆచార్య చల్లా రామకృష్ణ పాల్గొన్నారు.

సమాజాన్ని మార్చే శక్తి అధ్యాపకుల సొంతం

ప్రజాశక్తి-విశాఖపట్నం : సమాజాన్ని మార్చే శక్తి అధ్యాపకుల సొంతమని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. మంగళవారం ఎయు హెచ్ఆర్‌డిసి కేంద్రంలో నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ ఇండక్షన్ ప్రోగ్రాం ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సామాజిక అభివృద్ధికి దోహదకారిగా నిలవాలని సూచించారు. విద్యార్థిలో లోపాలను ఎత్తిచూపకుండా వారిని సరిదిద్ది మార్గదర్శకం అందించే బాధ్యతను పూర్తిస్థాయిలో నిర్వర్తించాలన్నారు. అధ్యాపకులు సామాజిక ఇంజనీర్లుగా నిలుస్తారన్నారు. భావిభారత పౌరులను తీర్చిదిద్దే గురుతర బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. ఇక్కడ నేర్చుకున్న అంశాలను నిస్వార్థంగా మీ కళాశాలలో విద్యార్థులకు చేరువచేసే దిశగా పనిచేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టులో విద్యార్థులను భాగస్వాములను చేస్తూ సమాజంతో విద్యార్థులను అనుసంధానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఆర్‌డిసి కేంద్రం సంచాలకులు ఆచార్య టివి.కృష్ణ, ఆచార్య ఎస్ఎమ్. పాల్ తదితరులు పాల్గొన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న 21 మంది అధ్యాపకులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

మణిపూర్‌లో దాడులపై నిరసన



హుకుంపేటలో క్రైస్తవుల ర్యాలీ

ప్రజాశక్తి -యంత్రాంగం

హుకుంపేట:మణిపూర్‌లో క్రైస్తవఆదివాసులపై జరుగుతున్న దాడులు వెంటనే నిలుపుదల చేయాలని నేషనల్ ప్రెయార్ ఫెలోషిప్ దైవ సేవకులు ఎస్.బాలకృష్ణ, హుకుంపేట పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్ష, కార్యదర్శి వి.మోజేష్, కె.జేమ్స్ కోరారు. గిరిజన సంఘం,ఆదివాసి సంఘాలు కలసి మంగళవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ముందుగా రాళ్ళ గెడ్డ నుండి కొంతీలి జంక్షన్ వరకు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. మూడు రోడ్ల కూడలిలో మానవహారం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మతం పేరుతో హింసా కాండని సృష్టించడం తగదన్నారు. ఆదివాసీ గిరిజన సంఘ జిల్లా అధ్యక్షులు టి.కృష్ణా రావు. మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం బోయ/ వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేరుస్తామని అసెంబ్లీలో చేసిన తీర్మానం తక్షణమే రద్దు చేయాలని అన్నారు. చట్టాలు, జీవోలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో యుసివైఏ వ్యవస్థాపకులు అర్.జాన్, దైవ సేవకులు సల్మాన్ రాజు, డి.ప్రసాద్, వైస్ ఎంపీపీ ఎస్.కొండలరావు, గిరిజన సంఘం ఉప అధ్యక్షుడు రామారావు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: మండల కేంద్రంలో హెూలీ గ్రౌండ్ సమీపంలో క్రైస్ట్ చర్చ్ నుండి భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు.నాలుగు రోడ్ల కూడలిలో మానవహారాన్ని చేపట్టారు.మణిపూర్ ముఖ్యమంత్రి, నరేంద్ర మోడీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. గిరిజన మహిళలకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యుడు కోర్ర త్రినాథ్, మండల వైస్ ఎంపీపీ1 పి.సత్యనారాయణ, బిఎస్‌పి పార్టీ మాజీ ఎమ్మెల్యే లకే రాజారావు,మండల గిరిజన సంఘం నాయకులు ఎం ఎం శ్రీను, తెలుగుదేశం పార్టీ నాయకులు పాంగి పాండురంగస్వామి, మండల పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు మోహన్ రావు, కార్యదర్శి చిట్టిబాబు, ఐఈటి కోఆర్డినేటర్స్ సురేష్, రత్నమని, ప్రసాద్ ,వైకుంఠరావు, ఆదివాసి ప్రభావిత పదం సంఘ పాస్టర్ సింహాచలం గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ముంచంగిపుట్టులో క్రైస్తవుల ర్యాలీ

పాఠశాల మరమ్మతు పనులు

'ప్రజాశక్తి'
కథనానికి స్పందన



పాఠశాలకు మరమ్మతు పనులు చేస్తున్న కూలీలు

ప్రజాశక్తి -అనంతగిరి: నాడు నేడు నిధుల దుర్వినియోగంపై ప్రజాశక్తి దిన పత్రికలో వచ్చిన కథనానికి స్పందించిన విద్యాశాఖ అధికారులు పాఠశాల మరమ్మతు పనులు మొదలుపెట్టారు. మండలంలోని బొర్రా స్కూల్ కాంప్లెక్స్ పరిధి టోకురు పంచాయతీ బలియగుడ ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో 35 మంది విద్యార్థులు చదువుతున్నారు.ప్రభుత్వం రెండో విడత కింద రూ 34.71 లక్షలు నిధులు మంజూరు చేసింది. ఆ నిధులతో పాఠశాల మరమత్తు పనులు చేపట్టకుండానే రూ.16.78 లక్షల నిధుల దుర్వినియోనికి పాల్పడినట్లు ప్రజాశక్తి పత్రికలో కథనం ప్రచురణ కావడంతో సంబంధిత మండల విద్యాశాఖ అధికారులు రంగంలో దిగారు. నాడు నేడు పనులు పూర్తి చేయకుండా వేరే చోటికి బదిలీ అయిన ఉపాధ్యాయుడు ప్రభాకర్ రప్పించారు. చేపట్టవలసిన పనులను పూర్తి చేయాలని ఆదేశించడంతో గత మూడు రోజుల నుండి పాఠశాల మరమ్మతు పనులు జరుగుతున్నాయి.

శ్యామల మృతి మిస్టరీని ఛేదించలేరా?

ప్రజాశక్తి-సీతమ్మధార : అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం రాజేంద్రపాలెం ప్రభుత్వ వైద్యులు డాక్టర్ మళ్ళ శ్యామల అనుమానాస్పదంగా మృతి చెంది మూడేళ్లుపూర్తయినా నేటికీ మిస్టరీని ఛేదించకపోవడం ప్రభుత్వ, పోలీసుల పనితీరుకి అద్దం పడుతోందని లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి ఎద్దేవాచేశారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మంత్రి గుడివాడ అమర్నాధ్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్‌చేశారు. శ్రీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, వైద్యురాలిది హత్యా, ఆత్మహత్య అనే అంశంపై నిగ్గు తేల్చాల్సిన పోలీసులు ఎందుకు మౌనంగా ఉన్నారని, సంఘటనను ఎందుకు మిస్టరీగా మిగిల్చారని ప్రశ్నించారు. పోలీసుల అలసత్వానికి ఒక కుటుంబం నష్టపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. 2020 ఆగస్టు 4 డాక్టర్ శ్యామల విధులకు బయలుదేరి అదే రోజు తాళ్లపాలెం దగ్గర నిర్మాణంలో ఉన్న పోలవరం వాటర్ స్టోరేజీ కెనాల్లో ఆమె మృతిచెంది ఉన్నారని, అడుగు నీరు కూడా లేని చోట ఆమె ఎలా చనిపోయారని ప్రశ్నించారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ఇంకా దర్యాప్తు కొనసాగించడం విడ్డురంగా ఉందని పేర్కొన్నారు. పోలీసులకు ప్రభుత్వానికి డాక్టర్ శ్యామల మృతి అంతుచిక్కని పరిస్థితి ఉంటే సిట్‌కు అప్పగించాలని భీశెట్టి డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డాక్టర్ శ్యామల భర్త స్వామినాయుడు, లోక్ సత్తాపార్టీ నాయకులు ఎమ్ఎస్ఎన్.మూర్తి, వడ్డే హరి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

తమ్ముడిని హత్య చేసిన అన్న

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండలంలోని గసభ పంచాయతీ గొందిగుడ గ్రామంలో తమ్ముడిని అన్నయ్య హత్య చేసిన సంఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. మంగళవారం డుంబ్రిగుడ ఎస్ఐ సంతోష్ కుమార్ అందించిన వివరాల ప్రకారం.. సన్నమ్మ, సాన ఇద్దరు కూడా వరసకు అన్నదమ్ములు. తరచుగా గొడవలు పడేవారు. పాంగి సనమ్మ అనే అన్నయ్య(60), పాంగి సాణ(55) తమ్ముడిపి గొడ్డలితో నరికి హత్య చేశాడు. నిందితుడు సన్నమ్మను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అరకులోయ ఏరియా హాస్పిటల్ కి తరలించినట్లు ఎస్సై తెలిపారు.



పట్టుబడిన నిందితులతో పోలీసులు

12 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలో జిఎం కొత్తూరు జంక్షన్ వద్ద సోమవారం సాయంత్ర పోలీసులు వాహన తనిఖీలు చేస్తున్నారు.చింతపల్లి నుండి పాడేరు వస్తున్న కారును తనిఖీ చేయగా 12 కిలోల గంజాయి లభ్యమైంది. అందులో ప్రయాణిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారించారు.వారి వద్ద నుండి గంజాయితోపాటు కారు మూడు సెల్ ఫోన్ లను స్వాధీన చేసుకని నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు సిఐ సత్యనారాయణ తెలిపారు.

12 నుంచి ఎఐటియుసి జిల్లా మహాసభలు

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ నగరంలో ఈ నెల 12వ తేదీ నుంచి రెండు రోజుల పాటు ఎఐటియుసి జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం కాంట్రాక్ట్ వర్కర్స్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ తెలిపారు. పెదగంట్యాడలోని పోతిన సన్యాసిరావు భవన్‌లో మంగళవారం ఎఐటియుసి జిల్లా మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, ఎఐటియుసి ఏర్పాటైన నుంచి నేటి వరకు కార్మికుల పక్షాన రాజీలేని పోరు సాగిస్తోందన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటు శక్తులకు కట్టబెడుతోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పల్లేటి పోలయ్య, జి.ఆనంద్, కె.అచ్యుతరావు, పి.దుర్గారావు, సిహెచ్.పెంటారావు, వై.దేముళ్లు పాల్గొన్నారు.

బాలల అరెస్టు చూపకుండా నిర్బంధిస్తే చర్యలు

ప్రజాశక్తి-సీతమ్మధార : బాలలను వివిధ కేసుల్లో అదుపులోకి తీసుకొని అరెస్టు చూపకుండా రోజులు తరబడి పోలీస్ స్టేషన్లలో నిర్బంధించే పోలీసులపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చట్ట ప్రకారం చర్యలతో పాటు తీవ్రంగా పరిగణించాల్సి ఉంటుందని కమిషన్ సభ్యులు గొండు సీతారాం పేర్కొన్నారు. నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో ఒక కేసులో పోలీసులు ముగ్గురు బాలలను అదుపులోకి తీసుకొని అరెస్టులు చూపకుండా రోజుల తరబడి కస్టడిలో ఉంచుకున్నట్టు వివిధ దిన పత్రికల్లో వచ్చిన వార్తలను సుమోటాగా తీసుకున్న గొండు సీతారాం మంగళవారం ఆ స్టేషన్‌ను సందర్శించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాసరావు, సబ్ ఇన్‌స్పెక్టర్‌తో కలిసి స్టేషన్‌ను పరిశీలించారు. ముగ్గురు బాలలు ఒక గదిలో ఉండడాన్ని గమనించారు. ఏ కేసు విషయంలో, ఎన్ని రోజుల క్రితం స్టేషన్‌కు తీసుకొచ్చారు, వారి వయసెంత, శరీరంపై దెబ్బలేమైనా ఉన్నాయా, లాఠి ప్రయోగాలు చేశారా అడిగి తెలుసుకున్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్

వీధి విక్రయదారులకు బ్యాంకు రుణాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వీధి విక్రయదారులకు బ్యాంకు రుణాలు ఇవ్వనున్నట్టు లీడ్ బ్యాంకు డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. ప్రధానమంత్రి స్వానిధి కార్యక్రమానికి సంబంధించి ఆయన ఆధ్వర్యంలో మంగళవారం జివిఎంసి జోన్ - 4 సమావేశ మందిరంలో వీధి విక్రయదారులకు రుణాలు మంజూరు అంశంపై సమావేశం నిర్వహించారు. జివిఎంసి పరిధిలో ఉన్న చిరు వ్యాపారులు, తోపుడు బండ్ల వర్తకులకు మొదటి విడతగా రూ.10 వేలు, రెండో విడతగా రూ.20 వేలు, మూడో విడతగా రూ.50 వేలు రుణాలు బ్యాంకుల ద్వారా అందించనున్నట్టు శ్రీనివాస్ తెలిపారు. సకాలంలో రుణాలను పూర్తిగా చెల్లించిన వారికి వడ్డీ రాయితీ ఇస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో జోన్ 4 జోనల్ కమిషనర్ శివ ప్రసాద్, యుసిడి పథక సంచాలకులు, ఇన్‌ఛార్జిలు లక్ష్మి, రామలక్ష్మి, డివైపిఓ శైలజ, టిడిఎఫ్ఓ పుణ్యవతి, నాగరాజు, రమేష్, లలిత పాల్గొన్నారు.

చంద్రబాబుపై రౌడీషీట్ ఓపెన్ చేయాలి

- రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : హింసాత్మక రాజకీయాలు చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని, పుంగనూరులో ఆయన ఇదేవిధమైన కుట్రను అమలు చేశారని, ఈ క్రమంలో ఆయనపై రౌడీషీట్ ఓపెన్ చేయాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మంగళవారం సాయంత్రం విశాఖలోని సర్క్యూట్ హౌస్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ పోలీసులను రెచ్చగొట్టడం, తద్వారా వారు ఫైరింగ్ ఓపెన్ చేస్తే ఎవరో ఒకరు చనిపోతే తమ పార్టీ కార్యకర్తలను అన్యాయంగా చంపారంటూ ఒక డ్రామాతో రాజకీయ లబ్ధి పొందాలనేది బాబు రాజకీయ పన్నాగమని అన్నారు. పోలీసులు ఒక వైపు దెబ్బలు తింటున్నా ఎక్కడా సంయమనం కోల్పోకుండా నిబద్ధతతో విధులు నిర్వహించారని చెప్పారు. దీంతో చంద్రబాబు దుష్టాలోచన పారలేదన్నారు. పుంగనూరు బైపాస్‌లో పోలీసులపై టిడిపి దాడికి ముమ్మాటికీ చంద్రబాబునే కారకుడని, ఈ కేసులో అతనే ప్రథమ ముద్దాయి అని తెలిపారు. అధికారం దక్కించుకోవడానికి చంద్రబాబు ఎంత నీచానికైనా దిగజారుతాడనేది మరోమారు స్పష్టమైందన్నారు. పుంగనూరులో అంతపెద్ద ఘటన జరిగినప్పుడు అందుకు కారణమైన వ్యక్తి ఎవరు.? ఏ విధంగా ప్లాన్ చేశారు ? ఎందువల్ల ఈ ఘటన జరిగింది ? అనే అంశాలపై మీడియా ఆలోచన చేయాలన్నారు.

నిరాడంబరంగా డాక్టర్ పివిఆర్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - విశాఖపట్నం : ఉత్తరాంధ్రలో ప్రముఖ వైద్యాలయమైన కళా హాస్పిటల్ అధినేత డాక్టర్ పైడి వెంకటరమణమూర్తి జన్మదిన వేడుకలు ఆ ఆసుపత్రి ప్రాంగణంలో మంగళవారం నిరాడంబరంగా జరిగాయి. నగరానికి చెందిన అధికారులు, అనధికారులు, వివిధ పార్టీల రాజకీయ ప్రముఖులు డాక్టర్ పివిఆర్‌కు పూలమాలలు, పుష్పగుచ్ఛాలు ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే దక్షిణ నియోజకవర్గంలోని 39వ వార్డు పరిధిలో ఉన్న హనుమాన్ టెంపుల్ వద్ద ఎల్లా రాజు ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పివిఆర్ మాట్లాడుతూ తన పుట్టిన రోజును పురస్కరించుకొని పివిఆర్ గ్రూపు సభ్యులు సామాజిక కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. అందరి అభిమానాలతో ముమ్ముందు ప్రజా జీవితంలో మరిన్ని సహాయ సహకార కార్యక్రమాలు చేపడతానని హామీ ఇచ్చారు. డాక్టర్ పివిఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో గ్రేటర్ విశాఖ 14వ వార్డు కార్పొరేటర్ కటారి అనిల్ కుమార్ రాజు, సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు గంట్ల శ్రీనుబాబు, సబ్బవరం మండల వైస్ ఎంపిపి చొక్కాకుల గోవింద, బొగ్గు శ్రీను, తదితరులు ఉన్నారు.

కందిపప్పు ఏదీ ?


మూడు నెలలుగా ఇవ్వని ప్రభుత్వం
- కొనుక్కోలేని స్థితిలో మార్కెట్

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, రాంబిల్లి, కొత్తకోట విలేకరులు

మూడు నెలల నుంచి పేదలకు ప్రభుత్వం కందిపప్పు ఇవ్వడంలేదు. చౌకదుకాణాల ద్వారా బియ్యం కార్డుదారులకు ఇవ్వాల్సిన కందిపప్పును జూన్, జులై, ఆగస్టు నెలల్లో పంపిణీ చేయలేదు. పైపెచ్చు ఎప్పుడు పంపిణీ చేస్తుందనేది కూడా చెప్పడంలేదు. మే వరకూ కిలో కందిపప్పును రూ.67కు ప్రభుత్వం ఇచ్చింది. తరువాత నుంచి పంపిణీ చేయకపోవడంతో అధిక ధరలకు అమ్ముతున్న కందిపప్పును పేదలు కొనుక్కోలేకపోతున్నారు. కనిష్టంగా రూ.వంద నుంచి వాటి నాణ్యత, బ్రాండ్‌ను బట్టి రూ.200కు పైగా వుంది. బయట మార్కెట్‌లోని ధరకు కొనుక్కోలేక అత్యధిక మంది పేదలు కందిపప్పు వాడ్డంలేదు. కొంతమంది కిలో వంద నుంచి రూ.150 రేటు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. జూన్, జులై నెలల కందిపప్పు ఆగస్టులో రేషన్‌తో కలిపి పంపిణీ చేస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాగేశ్వరరావు ప్రకటించినప్పటికీ ఆగస్టులో ఇవ్వాల్సిన కందిపప్పు ఇవ్వలేదు. జిల్లాలో 5.40 లక్షల బియ్యం కార్డులున్నాయి. ప్రతి నెలా 540 మెట్రిక్ టన్నుల కందిపప్పు కార్డుదారులకు పంపిణీ చేయాల్సివుంది. ప్రతి నెలా ఎండియు వాహన నిర్వాహకులను లబ్ధిదారులు అడుగుతున్నా వారు సమాధానం చెప్పలేకపోతున్నారు. చివరకు కందిపప్పు ఎందుకు రాలేదన్న విషయం పౌర సరఫరాల శాఖాధికారులు కూడా చెప్పలేని స్థితిలో వున్నారు.

బయట కొనుక్కోలేకపోతున్నాం

రేషన్ డిపోలో కందిపప్పు కిలో రూ.70కి ఇచ్చేవారు. మూడు నెలలుగా ఇవ్వడంలేదు. మార్కెట్‌లో మొదటి రకం కందిపప్పు రూ.140గా



వుంది. ఈ రేటుకు కొనుక్కొని ఏం తింటాం.

కె.రాములమ్మ, పొర్లుపాలెం, రావికమతం మండలం

ఐదు నెలల నుంచి కందిపప్పు ఆపేశారు

రేషన్ డిపోలో కందిపప్పు కిలో రూ.67కి ఇచ్చేవారు. ఐదు నెలల నుంచి ఇవ్వడం మానేశారు. కిరాణా షాపులో కిలో కందిపప్పు రూ.90 నుంచి వంద రూపాయల మధ్య అమ్ముతున్నారు.

భూపతి నూకరత్నం, కొండవారిపాలెం, రాంబిల్లి మండలం

దర్జాగా గెడ్డలు కబ్జా

95 సెంట్లు స్థలాన్ని ఆక్రమించిన వైజాగ్ ప్రొఫైల్స్ సంస్థ
విలువ రూ.3 కోట్లు పైమాటే

ప్రజాశక్తి - గాజువాక : విశాఖ నగరంలోని గాజువాక మండలం తుంగ్లాం గ్రామ రెవెన్యూ పరిధిలో వైజాగ్ ప్రొఫైల్స్ సంస్థ ఆక్రమణకు దిగింది. తన స్థలానికి ఆనుకొని ఉన్న గెడ్డలను ఆక్రమించి నిర్మాణాలు సైతం చేపట్టింది. మొత్తం 95 సెంట్లు మేర కబ్జా చేసి నిర్మాణాలు సాగిస్తున్నారు. దీని విలువ రూ.మూడు కోట్లు పైమాటేనని తెలుస్తోంది. ఇంత విలువైన స్థలాలను దర్జాగా తమ చేతుల్లోకి తీసుకొని నిర్మాణాలు చేపట్టడం వెనుక అధికార యంత్రాంగం సహకారం ఉందన్న విమర్శలు వినిపిస్తున్నారు. వాస్తవానికి స్టీల్ హ్యాండ్లింగ్ లాజిస్టిక్స్‌తో పాటు రియల్ ఎస్టేట్ రంగంలోనూ వైజాగ్ ప్రొఫైల్స్ కంపెనీ వ్యవహారాలు నిర్వహిస్తోంది. ఈ సంస్థపై పలు విమర్శలూ లేకపోలేదు. తాజాగా గెడ్డ కబ్జా అంశం చర్చనీయాంశంగా ఉంది. వాస్తవానికి సర్వే నెంబర్ 6, 8ల్లో గెడ్డలు ఉన్నాయి. సర్వే నెంబరు 6లో 3.08 ఎకరాల్లోనూ, 8లో 2.02 ఎకరాల్లోనూ గెడ్డ విస్తరించి ఉంది. వీటిలో ఆక్రమణలు చోటుచేసుకున్నాయి. సర్వే నెంబరు 6లో 80 సెంట్ల స్థలాన్ని సదరు సంస్థ ఆక్రమించింది. ఇక సర్వే నెంబర్ 8లో ఒక చోట 10 సెంట్లు, మరోచోట ఐదు సెంట్లు స్థలాన్ని కబ్జా చేసింది. ఈ గెడ్డలను ఆక్రమించడంతో సజావుగా నీరు ముందుకు వెళ్లే అవకాశం లేదు. వర్షాకాలంలో మరింత ఇబ్బంది ఎదురవుతుంది. భూగర్భ జలాలకూ నష్టం వాటిల్లుతుంది.

రెవెన్యూ అధికారుల అండదండలు

వైజాగ్ ప్రొఫైల్స్ నిర్వాహకులు కృష్ణారావుకు రెవెన్యూ అధికారుల అండదండలు పుష్కలంగా ఉన్నాయని స్థానికులు



ఆక్రమిత స్థలంలో సాగుతున్న నిర్మాణాలు

అంటున్నారు. గతంలో కూడా ఆయన కూర్మన్నపాలెంలో అపార్టుమెంట్ నిర్మాణం చేపట్టినప్పుడు ఇదేవిధంగా రోడ్లు ఆక్రమించి నిర్మాణాలు సాగించినట్టు విమర్శలు వినిపించాయి. అప్పట్లో పెద్ద ఎత్తున పత్రికల్లో వార్తలు ప్రచురితమైనా ఆయనకు ఉన్న పలుకుబడిని ఉపయోగించి వ్యవహారాన్ని చక్కబెట్టారు. పేదవాడు చిన్నపాటి జాగాలో గుడిసె వేసుకుంటే ఆగమేఘాల మీద తొలగించే రెవెన్యూ అధికారులకు పెద్ద మొత్తంలో గెడ్డలు కబ్జాకు గురవుతున్నా కనిపించకపోవడం గమనార్హం. వైజాగ్ ప్రొఫైల్స్ ఆక్రమణలపై గాజువాక తహాశీల్దారు కిరణ్ పావెల్‌ను వివరణ కోరగా దర్యాప్తు జరిపి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఆ సర్వే నెంబరును పరిశీలిస్తామన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు

జగన్ హయాంలో విశాఖ భక్షణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖను కాపాడుతానని నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెప్పిన జగన్.. నేడు అదే విశాఖను దోచుకు తింటున్నారని టిడిపి మాజీ మంత్రి, విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు విమర్శించారు. వైసిపి ప్రభుత్వం విశాఖలో అవలంబిస్తున్న నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా టిడిపి జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అధ్యక్షతన మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ 2017లో ఇదే ప్రాంతంలో సేవ్ విశాఖ పేరిట వైసిపి మహా ధర్నా చేపట్టిందని, ఆనాడు ప్రతిపక్ష నేత జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ విశాఖను కాపాడుకోవాలని, చంద్రబాబు బినామీలను తరిమి కొట్టాలని చెప్పారని గుర్తుచేశారు. అనంతర కాలంలో అధికారంలోకి వచ్చి మాట మార్చి భూ దోపిడీలకు పాల్పడుతున్నారని తెలిపారు. కావాలి జగన్ అన్న ప్రజలు నేడు పోవాలి జగన్ అంటున్నారని ఎద్దేవా చేశారు. విశాఖ నలుమూలలా ఉన్న వేల కోట్ల విలువైన భూములను వైసిపి నాయకులు కొట్టేశారని అన్నారు. ముఖ్యంగా విజయసాయిరెడ్డి ఉమ్మడి విశాఖ జిల్లాలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఇటువంటి భూ కబ్జాలకు పాల్పడ్డారని ఆరోపించారు. విశాఖలో అధికార పార్టీకి చెందిన ఎంపీ కుటుంబానికి సైతం రక్షణ కరువైందని అన్నారు. వైసిపివి నవరత్నాలు కావని, నవ మోసాలని పేర్కొన్నారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ జగన్ విశాఖ రావాలని ఉవ్విళ్లూరుతున్నారని, ఆయన వస్తే ఇక్కడి ప్రజలు ఆయనను భూస్థాపితం చేస్తారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ నాలుగేళ్ల పాలనలో వైసిపి నాయకులు విశాఖ నగరంలో అన్ని మతాల వారి భూములను కబ్జా చేశారని అన్నారు. కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, పార్టీ భీమిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు, జివిఎంసి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి, టిడిపి కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

గద్దర్‌కు ఘన నివాళి

విశాఖ జిల్లాలో ప్రజా గాయకుడు గద్దర్‌కు పలు ప్రజా సంఘాల నాయకులు మంగళవారం ఘన నివాళ్లర్పించారు. ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు.

ఎంవిపి.కాలనీ : వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఎయు మానవ వనరుల అభివృద్ధి శాఖ సెమినార్ హాల్‌లో సంతాప సభ నిర్వహించారు. సొసైటీ అధ్యక్షులు ఆచార్య ఎన్ఎడి.పాల్, కార్యదర్శి నరవ ప్రకాశరావు పాల్గొన్నారు.

కలెక్టరేట్ : ప్రజా యుద్ధనౌక గద్దర్‌కు పలు పౌర, ప్రజా సంఘాలు జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నివాళ్లర్పించాయి. పౌర ప్రజా సంఘాల సమన్వయకర్త పి.చంద్రశేఖర్, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణ మూర్తి, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, సిఐటియు జిల్లా కార్యదర్శి బి.జగన్, ఐద్వా నాయకులు మణి, సిపిఐ (ఎంఎల్) ప్రజా పోరు ప్రతినిధి దేవా, భారత నాస్తిక సమాజం ప్రతినిధులు వై.నూకరాజు, రాం ప్రభు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ప్రతినిధులు కె.నిర్మల, సుజాత, పిఒడబ్ల్యు ప్రతినిధి బాలనాగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కునగరం : ప్రజా గాయకుడు గద్దర్ మృతిపట్ల విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ సభ్యులు మంగళవారం స్టీల్‌ప్లాంట్ సెంట్రల్ స్టోర్ జంక్షన్‌లో నివాళు లర్పించారు. ఈ సందర్భంగా స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి.దాస్ మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ ఉద్యమంలో గద్దర్ పాత్ర మరువరానిదన్నారు. స్టీల్ గుర్తింపు యూనియన్ అధ్యక్షులు కెఎస్ఎన్.రావు మాట్లాడుతూ, ప్రజా చైతన్యం కోసం గద్దర్ జీవితాంతం కృషిచేశారన్నారు. పోరాట కమిటీ ప్రతినిధులు గణపతిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి

తెలుగు దినపత్రిక

43వ వార్షికోత్సవ ప్రత్యేక అనుబంధం

ప్రపంచ ఆదివాసీ దినోత్సవ

Advt. Feature

అల్లూరి సీతారామరాజు జిల్లా	బుధవారం 09-08-2023	8 పేజీలు

ప్రగతి పథాన అల్లూరి జిల్లా

◆ పర్యాటకంతో ఆదాయం భేష్ ◆ గతంకంటే మెరుగైన రోడ్డు, రవాణా సదుపాయాలు

◆ వైద్య సౌకర్యాల మెరుగునకు ప్రయత్నాలు

ప్రజాశక్తి - పాడేరు, అరకులోయ విలేకరులు

రాష్ట్రంలోనే విస్తీర్ణంలో అతిపెద్ద జిల్లా అయిన అల్లూరి సీతారామరాజు జిల్లా అభివృద్ధి బాట పడుతోంది. ప్రగతి దిశగా ఒక్కో అడుగూ ముందుకేస్తోంది. మునుపటికంటే రోడ్డు, రవాణా సదుపాయాలు, వైద్య సౌకర్యాలూ మెరుగయ్యాయి. మరిన్ని ప్రణాళికలతో ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజల సహకారంతో ముందుకెళ్తే ఉత్తమ ఫలితాలను ఈ జిల్లా సాధిస్తుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు.



అల్లూరి జిల్లా కలెక్టరేట్

ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి విడివడి అల్లూరి సీతారామరాజు జిల్లాగా 2022లో ఏర్పడ్డ పాడేరు మన్యం అటు రంపచోడవరం డివిజన్‌ను కలుపుకుని విస్తీర్ణంలో రాష్ట్రంలోనే అతిపెద్ద ప్రాంతంగా ఆవిర్భవించింది. కొత్త జిల్లా ఏర్పాటుతో ఈ ప్రాంత ముఖచిత్రం మారింది. అధికారులు, కార్యాలయాల సంఖ్య పెరగడం, పథకాల పర్యవేక్షణకు వీలుపడటం, కొద్దిగా రవాణా సదుపాయాలు మెరుగు పడటంతో గతంతో పోలిస్తే నూతన అల్లూరి జిల్లా అభివృద్ధిలో కాస్త మెరుగైంది. పర్యాటకం అభివృద్ధికి వీలు కలిగింది. వైద్య సదుపాయాలకు కొద్దికాలంగా పెద్దపీట (మిగతా 5లో..)

ప్రజల గొంతు.. ప్రజాశక్తి

◆ తెలుగు నేలపై చైతన్య బావుటా ◆ దినదినాభివృద్ధిలో పత్రిక
◆ అడుగడుగునా జన సహాయం ◆ ఘనంగా 43వ వార్షికోత్సవం

ప్రజాశక్తి... ప్రతి అక్షరం ప్రజల పక్షం. ప్రత్యామ్నాయ ప్రజా జర్నలిజానికి ప్రతీక. తెలుగు నేల చైతన్య బావుటా. అక్షర తూటాలతో అవినీతి, అక్రమాలను చీల్చిచెండాడుతుంది. ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొడుతుంది. ధనస్వామ్యంపై ధ్వజమెత్తుతుంది. నిస్సహాయుల తరుపున నికరంగా నిలబడుతుంది. సమాజ మార్పునకు విశేష కృషి చేస్తుంది. అందుకే అది ప్రజల పత్రికగాను, కార్మిక, కష్టజీవుల పత్రికగాను గుర్తింపు పొందింది. ఈ పత్రికకు అడుగడుగునా జన సహాయం అందుతూనే ఉంది. అన్ని రంగాలకు చెందిన వార్తలు ప్రచురిస్తూ ప్రజాశక్తి ప్రజల ఆదరణ పొందుతోంది. వార పత్రిక నుంచి దిన పత్రికగా, ఆ తరువాత టాబ్లాయిడ్, అనంతరం కలర్ పత్రికగా ఆవిర్భవించింది. ప్రత్యేక అంశాలతో ప్రజలను ఆకట్టుకుంటూ దినదినాభివృద్ధి చెందుతోంది. దీనిలో భాగంగానే పత్రిక అంచెలంచెలుగా ఎదుగుతూ ప్రస్తుతం 43వ వార్షికోత్సవ సంబరాలు నిర్వహించుకుంటోంది. ఈ నేపథ్యంలో ప్రజాశక్తి ప్రస్థానాన్ని గుర్తు చేసుకుందాం.

1980 సంవత్సరపు ఆఖరి రోజులు. అఖిలపక్ష రైతు ఉద్యమం రాష్ట్ర రాజకీయాలను ఉర్రూతలూపింది. మూడు నెలలపాటు రకరకాల పిలుపు లతో రాష్ట్రం వేడెక్కింది. వారపత్రికగా నడుస్తున్న ప్రజాశక్తి ఉద్యమావసరాలకు సరిపోవడం లేదనే ఆవేదన పెరుగుతున్నది. మరో వైపున పత్రికల విస్తరణ ఊపందుకుంది. అలాంటి తరుణంలో సిపిఎం పశ్చిమబెంగాల్ కమిటీ నుంచి అనుకోని ప్రతిపాదన వచ్చింది. అరవయ్యవ దశకంలో ఆంధ్రప్రదేశ్ కమిటీ తన దినపత్రిక అచ్చుయంత్రాన్ని బెంగాల్ కమిటీకి విక్రయించింది. దానిపైనే అప్పటి వరకూ బెంగాల్‌వారు గణశక్తిని సాయంకాలపు పత్రికగా ప్రచురిస్తున్నారు. ఇప్పుడు తాము కొత్త మిషన్ కొంటున్నామని, పాత మిషన్ కావాలంటే అప్పటి ధరకే అందజేస్తామన్నది వారి ప్రతిపాదన. దీనిపై సీనియర్ నాయకులు వెనువెంటనే చర్చించి ఆమోదించారు. ప్రజాశక్తి వారపత్రికను దినపత్రికగా వెలువరించాలని నిర్ణయించారు. రాష్ట్ర కమిటీ ఆ మేరకు ప్రకటన చేసింది.

ఆ ప్రకారం 1981 ఆగస్టులో వారపత్రిక ప్రచురణ ఆగింది. 'వారపత్రికగా సెలవు–దినపత్రికగా మీ సేవకు సిద్ధం' అంటూ నాటి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి, ప్రజాశక్తి దినపత్రిక ప్రథమ సంపాదకులు మోటూరు హనుమంతరావు వీడ్కోలు సంపాదకీయం రాశారు. దినపత్రిక సన్నాహాలు మొదలయ్యాయి.

నిజానికి ప్రజాశక్తికి 80 ఏళ్ల చరిత్ర ఉంది. నలభయ్యవ దశకంలో అది ప్రజల పత్రికగా, శ్రమజీవుల వాణిగా పేరొందింది. భాషా సంస్కృతి తదితర అంశాల్లో కూడా ప్రజాప్రయోజనాలకు పట్టం కట్టింది. ఇది సహించలేని వాళ్లు 'పెద్ద బాలశిక్ష ఫెయిల్ – ప్రజాశక్తి పాస్' అంటూ అక్కసు వెలిబుచ్చేవారు. చదువురాని వాళ్లను కూడా చైతన్యపరిచేలా పదునైన భాషలో పత్రిక రావడమే వారి ఆగ్రహానికి కారణం. ప్రజాశక్తి ప్రభుత్వ నిర్బంధానికి గురైన తర్వాత మళ్లీ సాధారణ పరిస్థితులు ఏర్పడి పత్రికను పునరుద్ధరించినా ఆ పేరుతోగాక విశాలాంధ్ర పేరుతో వచ్చింది. మళ్లీ రాజకీయావసరాల రీత్యా 1968 నుంచి దాదాపు పదమూడేళ్ల పాటు ప్రజాశక్తి వారపత్రికగా నడిచింది. వారపత్రిక తేవడానికి అవసరమైనంత మేరకు కంపోజింగ్, ప్రెస్ ఉన్నాయి. దిన పత్రిక ప్రచురించడానికి చాలా సిబ్బంది కావాలి. యంత్రాంగమూ పెరగాలి. దీంతో మూడు నెలల ముందు సన్నాహాలు మొదలయ్యాయి. పుచ్చలపల్లి సుందరయ్య ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. మోటూరు హనుమంతరావు పత్రికా నిర్వహణ సంబంధమైన ఏర్పాట్లు చూశారు.

ప్రజాశక్తి దినపత్రికగా రాబోతుందన్న వార్త వామపక్ష ప్రగతిశీలవాదులకు ఎంతో ఉత్సాహాన్నిచ్చింది. నాయకుల ద్వారా దాతలు సహాయ సహకారాలు అందజేశారు. పుచ్చలపల్లి సుందరయ్య అధ్యక్షతన జరిగిన సభలో ఇఎంఎస్.నంబూద్రిపాద్ పత్రిక తొలి ప్రతిని ఆవిష్కరించారు. ఆ సందర్భంగానే సుందరయ్య.. కమ్యూనిస్టులు పత్రికను ఎంత విలువైనవిగా పరిగణిస్తారో వివరించారు. అప్పటివరకూ విశాలాంధ్ర మాత్రమే వామపక్ష దినపత్రికగా వెలువడుతుండేది. కమ్యూనిస్టు పత్రికలంటే అదే నమూనాలో ఊహించేవారు. సాధారణ వార్త ఎంత ముఖ్యమైనదైనా అంతకంటే పార్టీ సంబంధమైన వార్తకే ప్రథమ ప్రాధాన్యతనివ్వడం, ఉద్యమ సంబంధమైన నాయకుల ప్రకటనలు మొదటి పేజీలో ఇవ్వడం ఇందులో ప్రధానాంశం. అయితే ప్రజాశక్తిని కేవలం వ్యూస్ పేపరుగా కాక న్యూస్ పేపర్‌గా తీసుకురావాలని నాయకత్వం భావించింది. అంటే కేవలం పార్టీ సంబంధిత వార్తలు మాత్రమే కాకుండా అన్ని రకాలైనవి ఇవ్వాలని నిర్ణయమైంది. ఇదో కొత్త ఒరవడి. అయితే దాన్ని సంపూర్ణం గావించడానికి చాలా కాలం పట్టింది. ప్రజాశక్తి దినపత్రిక పున:ప్రారంభమైన కొద్ది రోజుల్లోనే కారల్ మార్క్స్ జయంతి ఉత్సవాలు వచ్చాయి. ఆ పైన సిపిఎం జాతీయ మహాసభలు విజయవాడలో అపూర్వంగా జరిగాయి. ఇవన్నీ కూడా పాఠకులకు ఆసక్తికరమైన సందర్భాలు కావడంతో పత్రిక చురుగ్గా నడిచింది. ఆదివారం అనుబంధం విభిన్నంగా ఉందని అభినందనలు వచ్చాయి. పెద్ద యంత్రాంగం లేకున్నా ఉత్సాహవంతులైన యువ పాత్రికేయులే శ్రమపడి రాస్తుండేవారు.

కొత్త యంత్రం.. నూతన భవనం

అప్పటికే తెలుగు దినపత్రికల్లో కొత్త పోకడలు ఊపందుకున్నాయి. ఆంధ్రప్రభ స్థానంలో ఈనాడు అగ్రశ్రేణి దినపత్రికగా అవతరించింది. జర్నలిజంలో కొత్త ధోరణులు తీసుకొస్తున్నది. పార్టీ సంబంధమైన వార్తలను కూడా ప్రజాశక్తిని మరపించేలా ఇవ్వాలన్నది దాని వ్యూహం. ఆ విధంగా 1982లో మహాసభ సందర్భంగా నాయకుల ఇంటర్వ్యూలు వగైరాలు ఎంతో విస్తృతంగా ఇచ్చింది. వనరులు, నిపుణులు ఎక్కువ. ఇలాంటి తరుణంలో ప్రజాశక్తి పాఠకుల్లో కూడా మరింత కొత్తదనం కావాలనే ఆకాంక్ష పెరిగింది. ఈలోగా ఎన్‌టిఆర్ రంగప్రవేశం, విజయం ఇవన్నీ రాజకీయాలను, మీడియాను అమితంగా ప్రభావితం చేశాయి. ఈ నేపథ్యంలో బెంగాల్ నుంచి తెచ్చుకున్న పాతమిషన్‌పై పత్రికను ప్రచురించడం ఆచరణ సాధ్యం కాని విషయంగా మారింది. అందుకే ఆఫ్‌సెట్ యంత్రాన్ని తెప్పించాలని నిర్ణయమైంది. అప్పటివరకూ మార్క్సిస్టు కార్యాలయంలో ఒక భాగంగా తీసుకుని నడుస్తున్న ప్రజాశక్తికి నూతన భవనం కూడా అవసరమని భావించారు. అలాంటి సమయంలో ఉద్యమ శ్రేయోభిలాషులైన కాట్రగడ్డ శ్రీనివాసరావు.. నవరంగ్ టాకీస్ పక్కన ఉన్న విలువైన స్థలాన్ని ప్రజాశక్తికి ఇచ్చేందుకు ముందుకొచ్చారు. 1983 మే 1న, ఆ రోజు మేడే మాత్రమే కాక సుందరయ్య జన్మదినం కూడా. ఆయనకు మహాభిమాని, సన్నిహితుడు అయిన శ్రీనివాసరావు ఆ రోజునే భవనాన్ని అంకితం చేయాలని నిర్ణయించారు. సీనియర్ నాయకులైన బిటి.రణదివే వచ్చి భవన ప్రారంభోత్సవంతో పాటు ప్రధానోపన్యాసం చేశారు.



విజయవాడలో ప్రజాశక్తి దినపత్రిక ప్రారంభ సభలో ప్రసంగిస్తున్న సుందరయ్య, వేదికపై నంబూద్రిపాద్, మోటూరు హనుమంతరావు (ఫైల్ ఫొటో)

ఆఫ్‌సెట్‌లో అందంగా ముద్రించిన పత్రికను చూసి పాఠకులు ఎంతగానో మెచ్చుకున్నారు. అప్పటినుంచి సాంకేతికంగానూ పత్రికలో నూతన ప్రయోగాలు మొదలయ్యాయి. మిగిలిన వారికున్న హంగులు లేకున్నా పత్రికలోని యువ మిత్రులు ప్రయోగశీలతతో దాన్ని విభిన్నంగా తేవడానికి ఎప్పటికప్పుడు ప్రయత్నించారు. ఇతర ప్రముఖ పత్రికలవారు కూడా హర్షిస్తూ వచ్చారు. పార్టీ పత్రికే అయినా ప్రజాశక్తి భిన్నంగా ఉంటుందనే వాదన బలపడింది.

ప్రజాస్వామ్య పునరుద్ధరణకు ఊపిరి

ఇంతలో నాదెండ్ల భాస్కరరావు వెన్నుపోటుతో ఎన్‌టిఆర్ ప్రభుత్వం కూలిపోయింది. రాష్ట్రంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణకు ఉద్యమం మొదలైంది. ప్రజాశక్తి ఆ ఘట్టంలో ఒక ముఖ్య భాగస్వామి అయింది. ప్రజాస్వామ్య ఉద్యమం విజయవాడ నుంచి ప్రారంభమైన రోజునే ప్రత్యేక సంచిక విడుదల చేయడంతో ప్రతివారి చేతిలోనూ అదే కనిపించింది. అప్పటి నుంచి నెలరోజుల పాటు మోటూరు హనుమంతరావు.. ప్రతిరోజూ ఇదే విషయమై సంపాదకీయాలు రాశారు. దానికితోడు కదం తొక్కించే శీర్షికలు, నాదెండ్ల మంత్రివర్గాన్ని విస్తరించినప్పుడు 'కీలుబొమ్మ మంత్రివర్గంలో తోలుబొమ్మలు" అని పెట్టిన హెడ్డింగ్ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆ నెల రోజులూ ప్రజాశక్తి.. ప్రజాస్వామ్య ఉద్యమాభిమానుల ఆదరణకు పాత్రమైంది. ఎన్‌టిఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రిగా ప్రతిష్టించిన తరుణంలో అన్నిటికన్నా ముందు ప్రజాశక్తి మార్కెట్లో విడుదలై సంచలనం సృష్టించింది. అలాగే ముఖ్యమైన పరీక్షా ఫలితాలు వంటివి కూడా పోటీ పడి విడుదల చేయడానికి కృషి జరగడంతో పత్రికను సీరియస్‌గా తీసుకోవడం పెరిగింది. వివిధ ప్రాంతాల్లో ఉత్సాహవంతులైన కార్యకర్తలు విలేకరులుగా వార్తలు పంపించడంతో కవరేజ్ కూడా మెరుగైంది. ఆ రోజులలో సత్తెనపల్లి సమీపంలోని కోళ్లూరు దగ్గర ఒక పెద్ద పడవ ప్రమాదం జరిగిన వార్తను ప్రజాశక్తి ఒక్కటే ఇవ్వడం పత్రికా రంగంలో సంచలనమైంది.

ప్రత్యేకతలు - ప్రతిబంధకాలు

1984లోనే తొలిసారిగా పరిశ్రమల సంచిక, స్వాతంత్ర్య దినోత్సవ ప్రత్యేక సంచికలు విడుదలయ్యాయి. ఇవన్నీ పత్రికస్థాయి పెరిగేందుకు దోహదపడ్డాయి. 1984లో ఇందిరాగాంధీ హత్య జరిగినప్పుడు ప్రజాశక్తి ప్రచురించిన పెద్ద ఫొటో హిందూ తర్వాత అత్యుత్తమంగా ఉన్నట్టు ప్రశంసించారు. ఇవన్నీ ఉన్నా న్యూస్‌ప్రింట్ వ్యయం, జీతభత్యాలు వగైరాలు పెరగడంతో పత్రిక నిర్వహణ కష్టంగా మారింది. అడ్వర్‌టైజ్‌మెంట్లు చాలని స్థితి. ఆ దశలో యాజమాన్యం ఆరు పేజీల పత్రికను నాలుగు పేజీలకు తగ్గించాలని నిర్ణయించింది. ఇతర పత్రికల పోటీని తట్టుకోవడమే కష్టంగా ఉన్న తరుణంలో ఉన్న పేజీలను తగ్గించడం, పత్రికల్లో వచ్చే ప్రధాన విషయాలేవీ దెబ్బతినకుండా ముందే తగు ప్రణాళిక తయారైంది. ఏమైనా ప్రజాశక్తి రాజకీయ నిబద్ధత, పాఠకాభిమానం దాన్ని నిలబెట్టాయి. పేజీల తగ్గింపు పత్రిక సర్క్యులేషన్‌ను తీవ్ర ప్రభావితం చేయకపోవడం ఆశ్చర్యకరమైన వాస్తవం. ఒక ప్రధాన దినపత్రిక నాలుగు పేజీలతో వెలువడి నిలదొక్కుకున్న ఉదాహరణ ఆధునిక తెలుగు జర్నలిజంలో మరి కనిపించదు. అయితే అది కోరుకున్న పరిస్థితి ఏమీ కాదు. వీలు చిక్కగానే ప్రజాశక్తి తిరిగి ఆరు పేజీలకు పెరిగింది. ఈ కాలమంతటా సాంకేతికంగానూ, సిబ్బంది దృష్ట్యాను ప్రజాశక్తి హంగులు సమకూర్చుకుంటూనే వచ్చింది. ఉన్నంతలో అదనపు ఆకర్షణలు, శీర్షికలను జతచేసింది. అన్నిటికన్నా ముఖ్యంగా రాజకీయ నైశిత్యాన్ని నిలబెట్టడంలో విశేషకృషి చేసింది. రాష్ట్రంలోని రాజకీయ సీనియర్ నాయకుల్లో ఒకరుగా, కమ్యూనిస్టు వ్యాఖ్యాతలలో అగ్రగణ్యుడుగా పేరెన్నికగన్న మోటూరు హనుమంతరావు సంపాదకీయం దానికి పెద్ద పెట్టుబడి కాగా, ఉత్సాహం, అంకితభావం గల సంపాదకవర్గం, యాజమాన్యం, సిబ్బంది దాన్ని ముందుకు నడిపే సైన్యంగా పనిచేశారు. అప్పటికే రంగంలో ఉన్న పత్రికలతో ధీటుగా అది ముందుకు సాగింది. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా వామపక్ష లౌకిక శక్తుల ఐక్యతను పెంచడం దాని ప్రధాన నినాదమైంది. అప్పట్లో అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీకి మద్దతునిస్తూనే విధానపరమైన అంశాల్లో నిక్కచ్చిగా విమర్శలు చేసేది.

1984 ఎన్నికల పోరాటంలో ప్రజాశక్తి ఇచ్చిన సమాచారం, ప్రత్యేక ఫీచరింగ్ నినాదాలు వంటివి అందరినీ ఆకర్షించాయి. 1985లో కారంచేడులో దళితులపై హత్యాకాండ జరిగింది. ఆ వార్తను ముందుగా ఇచ్చిన వాటిలో ప్రజాశక్తి ఒకటి. తర్వాత కూడా ఆ వివరాలను ప్రత్యేక ప్రాధాన్యతతో ఇస్తూ వచ్చింది. 1985 మే 25న సుందరయ్య కన్నుమూశారు. పత్రిక మొదటి పేజీలో ఆయన పెద్ద ఫొటోతో రాసిన లీడ్ పాఠకులను కదిలించింది. లౌకిక పార్టీల ఆధ్వర్యంలో సాగిన ఉద్యమాలకు ఎప్పుడూ ప్రజాశక్తి వాణిలా పనిచేస్తూ వచ్చింది. దానితో పాటు పలు శీర్షికల ద్వారా రాజకీయ, సైద్ధాంతిక చైతన్యం పంచిపెట్టింది.

1988 డిసెంబర్‌లో వంగవీటి మోహనరంగా హత్యానంతరం అల్లర్లు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీశాయి. సంయమనంతో సమతుల్యతతో వ్యవహరించి వాస్తవాలను వెలికితీసి ప్రచురించింది. 1987 తర్వాత రాజీవ్‌గాంధీ బోఫోర్స్ కుంభకోణం దేశాన్ని కుదిపేసింది. ఆ సమాచారాన్ని తేవడంతో ప్రజాశక్తి ప్రముఖ పాత్ర వహించింది. హిందూ సహ సంపాదకునిగా ఉన్న ఎన్.రామ్ భోఫోర్సు కుంభకోణం తాలూకా కీలక పత్రాలను తమ పత్రికలో ప్రచురించడానికి అప్పటి సంపాదకులు అంగీకరించనందున ఇతర పత్రికల ద్వారా విడుదల చేశారు. తెలుగులో ఆయన ప్రజాశక్తిని ఎంచుకున్నారు. భోఫోర్స్ వార్తల ఫీచరింగ్‌తో వచ్చిన ప్రజాశక్తి సాయంత్రం మార్కెట్లో పెద్ద సంచలనమైంది. ఆ నేపథ్యంలో 1989లో కేంద్రంలో నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం వచ్చింది. రాష్ట్రంలోని తెలుగుదేశం ఓడిపోయి, కాంగ్రెస్ అధికారం చేపట్టడంతో ప్రజాశక్తి రాజకీయ బాధ్యత పెరిగింది. రాజకీయాంశాలతో పాటు పత్రిక ఆదాయాన్ని పెంచే అడ్వర్‌టైజ్‌మెంట్లు, ఇతర యంత్రాంగాన్ని పెంచుకోవడంపై కేంద్రీకరణ పెరిగింది.

1990 ప్రజాశక్తికి మరోమలుపు. అందులో ఒకటి కంప్యూటర్ల ప్రవేశం. మరొకటి రంగురంగుల ప్రత్యేక సంచికల ప్రారంభం. అప్పటికే వివిధ దినపత్రికలు కంప్యూటర్లను ప్రవేశపెట్టాయి. కాస్త ఆలస్యమైనా సమగ్రంగా ప్రజాశక్తి కంప్యూటరీకరణను చేపట్టింది. ఉద్యమ శ్రేయోభిలాషి కొండయ్య అందుకు దోహదపడ్డారు. 1999 మే 19 నుంచి కంప్యూటర్ మీద తేవాలనుకున్నది.. సిబ్బంది ఉత్సాహం వల్ల మే 1 నుంచే తేగలిగారు. ఇతర పత్రికలు మ్యాటర్ వరకు కంప్యూటర్‌పై చేసి, లే అవుట్, పేస్టింగ్ చేసేవి. కానీ ప్రజాశక్తి ఒకేసారి పేజీనేషన్ చేయడం విశేషం. కంప్యూటర్ వ్యవస్థను లోతుగా అధ్యయనం చేసిన సిబ్బంది, బాధ్యులు అనేక నూతన ప్రక్రియలను అన్వేషించారు. ఆ విధంగా పత్రిక కొత్త ఆకర్షణ సంతరించుకోవడానికి దోహదపడ్డారు. 1990లో గోదావరి గైడ్ పేరిట పుష్కరాల ప్రత్యేక సంచిక వచ్చింది. ప్రజాశక్తి ప్రత్యేక సంచికలు ప్రతిష్టాత్మకంగా రావడానికి అది నాంది పలికింది.

1991లో దశమ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎన్.రామ్ ప్రజాశక్తి సాంకేతిక పద్ధతులను చూసి ఆనందాశ్చర్యాలు వెలిబుచ్చారు. చేతి కంపోజు నుంచి ఒకేసారి పేజినేషన్‌కు వెళ్లారంటే బూర్జువా దశను దాటి సోషలిస్టు దశలోకి ప్రవేశించారన్న మాట అని చమత్కరించారు. సుందరయ్య రాజకీయాలతో పాటు సాంకేతిక అభివృద్ధి గురించి తనతో తరచూ చర్చించేవారని, ప్రజాశక్తిని చూస్తుంటే ఆయన కలలు నిజమైనట్లు అనిపిస్తోందని రామ్ కరతాళధ్వనుల మధ్య అన్నారు. పదో వార్షికోత్సవానికి సోదర పత్రికల సంపాదకులందరూ హాజరై అభినందించారు. దశమ వార్షికోత్సవం వాస్తవానికి రాజకీయంగా, పత్రికాపరంగా కొత్త దశకు సూచన. తర్వాతకాలంలో (మిగతా 4లో)

మన్యం.. అందాల నిలయం


పాల సముద్రాన్ని తలపించేలా వంజంగి హిల్స్

ప్రజాశక్తి-పాడేరు టౌన్

పర్యాటక రంగం పేరు చెబితే అల్లూరి సీతారామరాజు జిల్లా మన్య ప్రాంతమే గుర్తుకొస్తుంది. కృత్రిమ అందాలకు ఇక్కడ తావుండదు. ఎటుచూసినా ఎత్తయిన కొండలు.. పచ్చదనం పరచుకున్న లోయలు, జాలువారే జలపాతాలు, పాల కడలిని తలపించేలా పొగమంచు కనువిందు చేస్తుంటాయి. సహజసిద్ధ ప్రకృతి అందాలకు నిలయం. పర్యాటకుల మదిని దోచుకుంటున్న ఆంధ్రా ఊటీ అరకులోయ, ఆంధ్ర కశ్మీర్ లంబసింగితో పాటు అంతకుమించిన అందాలు మన్యంలో మరెన్నో ఉన్నాయి.

ప్రకృతి సహజ సిద్ధంగా ఏర్పడిన బొర్రా గృహలు అనంతగిరి మండలంలో ఉన్నాయి. విశాఖపట్నం నుండి రైలులో ప్రయాణించే క్రమంలో కొండ గుహల నుండి రైలు వెళ్తూ ఉంటూ ఎంతో అనుభూతి పొందుతారు. అరకులోయలో గిరిజన ఆచార, వ్యవహారాలు, సంప్రదాయాలను ప్రతిబింబించే గిరిజన మ్యూజియం ఉంది. మ్యూజియం ఆవరణలో బోటింగ్ చేయవచ్చు. ఇక్కడకు సమీపంలోనే కాఫీ మ్యూజియం ఉంది. అందులో వివిధ రకాల కాఫీ రుచులను ఆస్వాదించవచ్చు. పద్మాపురం ఉద్యాన వనంలో భిన్న రకాల పూల మొక్కలు స్వాగతం పలుకుతాయి. అరకులోయలో రాత్రికి బస చేయొచ్చు. మరుసటి రోజు అరకులోయ నుంచి పాడేరు వెళ్లే మార్గంలో అరకుకు 16 కిలోమీటర్ల దూరంలో డుంబ్రిగుడ వద్ద చాపరాయి జలపాతం ఉంది. సొంత వాహనాల్లో వెళ్ళవచ్చు. ఆర్‌టిసి, ప్రైవేటు వాహనాలు కూడా ఉన్నాయి. అలాగే డుంబ్రిగుడ మండలంలో అంజోడా సిల్క్ ఫారం, కొల్లాపుట్టు జలతరంగిని పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి.


అక్కడ నుంచి పాడేరు చేరుకుని, మరుసటి రోజు ఉదయాన్నే ఇప్పటికే ప్రాచుర్యంలోకి వచ్చిన పాడేరుకు 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న వంజంగి హిల్స్‌ను సందర్శించవచ్చు. పాడేరు మండలం వంజంగి పంచాయతీ కల్లాలబయలు ప్రాంతంలో దట్టమైన మంచుతో పాల సముద్రాన్ని తలపించే వంజంగి హిల్స్ అందాలు ఎంత గానో


దుడుమ జలపాతం

మైమరపిస్తాయి. పర్యాటకులు ముందు రోజు రాత్రి పాడేరులో బస చేసి వేకువజామునే బయలుదేరి వంజంగి హిల్స్‌కు చేరుకుంటారు. ఇక్కడ ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకు పాలసముద్రంలా కనిపించే మంచు అందాలను వీక్షించవచ్చు.

అందాల కొత్తపల్లి

పాడేరు నుంచి 30 కిలోమీటర్లు ప్రయాణిస్తే జి.మాడుగుల మండలంలో కొత్తపల్లి జలపాతానికి చేరుకోవచ్చు. ఈ జలపాతం సందర్శకులను అలరిస్తూ ప్రముఖ పర్యాటక ప్రదేశంగా గుర్తింపు పొందింది. మెట్ల మాదిరిగా ఉండే కొండరాళ్ళపై నుంచి జాలువారే జలపాతం ప్రకృతి ప్రేమికుల మనసు దోచుకుంటుంది. విశాఖపట్నం నుంచి పాడేరు మీదుగా, నర్సీపట్నం వైపు నుంచి అయితే లంబసింగి, లోతుగెడ్డ జంక్షన్ మీదుగా కొత్తపల్లి చేరుకోవచ్చు. పాడేరు నుంచి ఆర్‌టిసి బస్సులు, ప్రైవేటు వాహనాలు ఉంటాయి. పాడేరు-చింతపల్లి ప్రధాన రహదారికి ఆనుకుని ఈ జలపాతం ఉంటుంది. సొంత వాహనాల్లో కూడా వెళ్లొచ్చు.


కొత్తపల్లి జలపాతం వద్ద పెద్ద సంఖ్యలో పర్యాటకులు

ఆంధ్ర కాశ్మీర్ లంబసింగి

ఆంధ్ర కాశ్మీర్‌గా పేరొందిన లంబసింగి ప్రాంతం అతి శీతలమైంది. ఇక్కడ దట్టంగా కురిసే మంచు అందాలను ఆస్వాదించవచ్చు. విశాఖపట్నం నుంచి వచ్చే పర్యాటకులు నర్సీపట్నం మీదుగా లంబసింగి చేరవచ్చు. పాడేరు నుండి అయితే చింతపల్లి మార్గంలో లోతుగెడ్డ జంక్షన్ మీదుగా ఇక్కడకు చేరుకోవచ్చు. అత్యధిక మంది పర్యాటకులు ముందు రోజు రాత్రి నర్సీపట్నంలో బస చేసి వేకువజామునే బయలుదేరి లంబసింగి వస్తుంటారు. ఇక్కడి ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకు దట్టంగా మంచు కురుస్తూ ఉంటుంది. శీతాకాలంలో పక్కనున్న వారు కనిపించనంత దట్టంగా పొగమంచు పడుతుంది.

సుందరంగా డుడుమ

ప్రకృతి ప్రేమికుల్లో డుడుమ జలపాతం పేరు వినని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. ఆంధ్రా -ఒడిశా సరిహద్దులో ఉన్న ఈ జలపాతం పాడేరు నుంచి సుమారు 80 కిలోమీటర్ల దూరంలో ఉంది. సుమారు 600 అడుగుల ఎత్తు నుంచి హోరు శబ్ధం వేస్తూ దిగువకు జాలువారుతూ సందర్శకులకు కట్టిపడేస్తుంది. జలపాతాన్ని దగ్గరగా చూడాలంటే చాలా కిందకు దిగాల్సి ఉంటుంది. పాడేరు నుంచి ఆర్‌టిసి బస్సులు నడుస్తాయి. పెదబయలు, ముంచంగిపుట్టు మీదుగా చేరుకోవాలి. తిరుగు ప్రయాణంలో ముంచంగిపుట్టుకు ముందు ఎడమవైపు సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న జోలాపుట్టు జలాశయాన్ని కూడా సందర్శించవచ్చు.

జాలువారే జలపాతాలు

వీటితో పాటు మన్యంలో సొలభం పంచాయతీ కంఠవరం గ్రామానికి ఆనుకొని ఓ జలపాతం ఉంది. దీన్ని అక్కాచెల్లెమ్మల జలపాతంగా స్థానికులు పిలుస్తారు. కొయ్యూరు- బూదరాళ్ల మధ్య చింతవానిపాలెం సమీపంలో ఇసుకుల మడుగు జలపాతం ఉంది. పెదమాకరం పంచాయతీలో గానుగుల జలపాతం, పాడేరు మండలం సలుగు పంచాయతీ కందులపాలెం వద్ద జలపాతం, పెదబయలు మండలం గిన్నెలకోట పంచాయతీ పిట్టలబొర్ర గ్రామానికి సమీపంలో ఉన్న జలపాతం, అరకులోయ మండలంలో పద్మాపురం గార్డెన్స్ నుంచి సుమారు మూడు కిలోమీటర్ల దూరం వెళితే రణజిల్లేడ జలపాతం ఉన్నాయి. అలాగే అనంతగిరి మండలంలో అనంతగిరికి 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న తాడిగుడ, బొర్రా గుహలకు వెళ్లే మార్గంలో గేటు వలస జంక్షన్ నుంచి సుమారు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న కటికి జలపాతాలు, హుకుంపేట మండలంలో హుకుంపేట నుంచి ఉప్ప రహదారి మీదుగా సుమారు 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న దుర్గం పంచాయతీ సరసపాడు, పాటిగరువు గ్రామాల మధ్యలో జలపాతం సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి.


చాపరాయి జలపాతం వద్ద జలకాలాడుతున్న పర్యాటకులు

చాపరాయిలో జలకాలాటలు

ప్రజాశక్తి డుంబ్రిగుడ

డుంబ్రిగుడ మండలంలో చాపరాయి జలపాతం, అంజోడా సిల్క్ ఫారం, కొల్లాపుట్టు జలతరంగిని పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి. బొర్రా గుహలు, అరకులోయ అందాలను తిలకించిన వారు చాపరాయి సందర్శించకుండా ఉండరంటే అతిశయోక్తి కాదు. ఆంధ్ర ఊటీగా అరకులోయకు 16 కిలోమీటర్ల డుంబ్రిగుడ వద్ద ఉన్న చాపరాయి జలపాతానికి కార్తీకమాసంలో అధిక సంఖ్యలో దేశ విదేశాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. కొండరాయిపై జాలువారే నీటిలో జలకాలాటలు పర్యాటకులను మైమరపిస్తాయి. కుటుంబ సమేతంగా తరలివచ్చి జలపాతంలో సరదాగా జారుతూ స్నానాలు చేస్తూ ఆనందంగా గడుపుతుంటారు. ప్రస్తుతం ఈ జలపాతాన్ని ఐటిడిఎ తన ఆధీనంలో తీసుకొని పర్యాటకులకు సౌకర్యవంతంగా, ఆకర్షించే విధంగా పలు అభివృద్ధి పనులు చేపడుతుంది. రోడ్డు నుంచి జలపాతం కనబడకుండా ఉండేందుకు ప్రహరీ నిర్మిస్తున్నారు. సాయంత్రం నుంచి రాత్రుల్లో వచ్చే పర్యాటకులకు తిలకించడానికి విద్యుత్ సౌకర్యాన్ని కల్పించి, ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేశారు.

జైపూర్ జంక్షన్‌కు సమీపంలోనున్న అంజోడా సిల్క్ ఫారం ప్రత్యేకంగా వనభోజనాలు చేసే పర్యాటక ప్రాంతంగా గుర్తింపు పొందింది. ఈ సిల్క్ ఫారంలో సుమారు పది, పదిహేను ఎకరాల్లో వందల సంఖ్యలో పైన్ చెట్లు ఉండడంతో ఈ ప్రదేశం శీతకాలంలో మంచు కురిసినప్పుడు మరింత అందంగా కనబడుతుంది. ఇక్కడ అనేక సినిమా, సీరియల్ షూటింగ్‌లు జరుపుతున్నారు. సిల్క్ ఫారం అంటే వనభోజనాలు చేయడానికి ప్రత్యేక పర్యాటక ప్రదేశంగా ప్రతి ఒక్కరికీ గుర్తొస్తుంది. ప్రస్తుతం ఈ సిల్క్ ఫారంను పర్యాటకులకు ఆకర్షించే విధంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం అటవీ శాఖ ఆధ్వర్యంలో ఎకో టూరిజం పేరిట రూ.10 లక్షలతో కాటేజీలను నిర్మిస్తున్నారు. కొల్లాపుట్టులో జలతరంగిణి పర్యాటక ప్రాంతాన్ని ఐటిడిఏ ఆధ్వర్యంలో నిర్మించి పర్యాటకుల సౌకర్యార్థం కాటేజీలను, గార్డెన్‌ను ఏర్పాటు చేశారు. ఈ జలతలంగిణి చుట్టూ ఎత్తైన రాళ్ల కొండలు ఉండడంతోపాటు పైనాపిల్ సాగు ఎక్కువగా అవుతుండడంతో పర్యాటకులను ఇవి ఎంతో ఆకర్షిస్తున్నాయి. పర్యాటకులు అధిక సంఖ్యలో పర్యాటకులు వచ్చి వీటిని తిలకిస్తుంటారు.


జలతరంగిణి వద్ద నిర్మించిన కాటేజీలు

రైలు ప్రయాణం.. ఓ మధురానుభూతి

విశాఖపట్నం నుంచి అరకులోయ రైలు ప్రయాణం ఓ గొప్ప అనుభూతి. గుండెలు గుభేలుమనిపించే కొండదారిలో వెళ్తుంటే కింద పచ్చని తివాచీ పర్చినట్లు ప్రకతి, దట్టమయిన అడవులు, అందమైన వన్యప్రాణులు కనిపిస్తాయి. రైలు దాదాపు 40 గుహల ద్వారా ప్రయాణిస్తూ సరికొత్త అనుభూతిని మిగుల్చుతుంది.

సీలేరు.. నీకు సరిలేరు



ఇంటెక్ డ్యాం పరిసర అందాలు

జికె.వీధి మండలంలోని సీలేరులో ప్రకృతి రమణీయమైన దృశ్యాలు ఎల్లప్పుడూ పర్యాటకులను కట్టిపడేస్తాయి. సీలేరు, దారకొండ పరిసర ప్రాంతాల్లో వర్షాకాల సమయంలో ముసురు పట్టిన వేళ ప్రకృతి అందాలు మరింత కనువిందు చేస్తాయి. సీలేరు అటవీ ప్రాంతం, స్థానిక జలవిద్యుత్ కేంద్రం పరిసర ప్రాంతాల్లో పచ్చదనం పరుచుకుని నయనానందకరంగా ఉంటాయి. ఎత్తైన కొండలు, ప్రకృతి ఒడిలోని అందాలు చూపరుల మనసులను ఇట్టే దోచుకుంటాయి. ఇటీవల ఈ చూడచక్కని అందాలను సీలేరు యువకుడు ధనుంజయ డ్రోన్ కెమెరాతో ఒడిసిపట్టాడు. మబ్బుల వాతావరణం, నీలి మేఘాలు, దట్టంగా కమ్ముకున్న పొగ మంచు, సీలేరు జలవిద్యుత్ కేంద్రం, ఇంటెక్స్ డ్యాం, స్థానిక జలాశయం, నదీ జలాలు.. ఇలా అన్నింటినీ ఆయన తన కెమెరాలో బంధించాడు. ఇప్పుడవి సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నాయి.

ప్రజాశక్తి - సీలేరు



పొగమంచు అందాలు



సీలేరు జల విద్యుత్ కేంద్రం

ప్రజల గొంతు.. ప్రజాశక్తి



విజయవాడలో ఆఫ్‌సెట్ యంత్రాన్ని ప్రారంభించిన అనంతరం సభలో మాట్లాడుతున్న బిటి.రణదివె, చిత్రంలో సుందరయ్య తదితరులు

(రెండో పేజీ తరువాయి..) పత్రిక అభివృద్ధి వేగం పుంజుకుంది. 1991లో సోవియట్ విచ్ఛిన్నం, 1992లో బాబ్రీ మసీదు విధ్వంసం వంటి సందర్భాల్లో ప్రజాశక్తి నిర్వహించిన పాత్ర దాన్ని ప్రగతిశీల లౌకిక శక్తులకు మరింత దగ్గర చేసింది.

మరిన్ని ఎడిషన్లు

1994లో హైదరాబాదు ఎడిషన్ ప్రారంభమైంది. ఆ ప్రతిపాదనకు మొదట చాలా మంది భయపడ్డారు. కానీ అధునాతన సాంకేతిక సదుపాయాలతో సులభంగానే ఎడిషన్ ప్రారంభమైంది. ఇది తెలుగులో వామపక్ష పత్రికల చరిత్రలో కొత్త అధ్యాయం. తర్వాత కాలంలో ప్రత్యేక సంచికలు మరింత ఎక్కువగా వచ్చాయి. పత్రిక ఎనిమిది పేజీలైంది. శీర్షికలు పెరిగాయి. కంప్యూటర్ కేంద్రాలు పెరిగాయి. 1997లో విశాఖపట్నంలో మూడో ఎడిషన్ మొదలైంది. 1999లో పత్రిక కేంద్ర కార్యాలయం విజయవాడ నుంచి హైదరాబాద్‌కు మారింది.

కొత్త పుంతలు

2000లో నాటి చంద్రబాబు ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమంతో ప్రపంచీకరణ వ్యతిరే పోరాటాలతో ప్రజాశక్తి పూర్తిగా మమేకమైంది. పత్రికలో శీర్షికలు పెరుగుదలే కాక మరింత జనరంజకంగా మారాయి. యంత్రాంగం విస్తరించింది. చిరకాలంగా ఉన్న లోగో సహా అనేక మార్పులు జరిగాయి. 2001లో 20వ వార్షికోత్సవంలో తిరుపతి ఎడిషన్ మొదలైంది.

ఇక ఆ తర్వాత చకచకా ఎడిషన్లు పెరిగాయి. ఖమ్మం, కర్నూలు, రాజమండ్రి, కరీంనగర్, ఒంగోలు, రాష్ట్ర విభజన అనంతరం శ్రీకాకుళం, అనంతపురం ఎడిషన్లు వచ్చాయి. 2004 నుంచి జిల్లాల టాబ్లాయిడ్స్ కూడా మొదలయ్యాయి. సిబ్బంది పెరిగారు. పెరిగిన యంత్రాంగం, పునాది, మారిన ధృక్పథం ఇవన్నీ ప్రజాశక్తిని తెలుగు పత్రికా లోకంలో ఒక విలక్షణ ప్రగతిశీల పత్రికను చేశాయి.

అరకు రాజకీయాల్లో చురుగ్గా అరుణకుమారి

అధిష్టానం టికెట్ కేటాయిస్తే అసెంబ్లీ నుంచి పోటీకి సిద్ధం


అరుణకుమారి


అప్పాలు

ప్రజాశక్తి - అరకులోయ

అరకు అసెంబ్లీ నియోజకవర్గం రాజకీయాల్లో కార్తికో అరుణకుమారి చురుకుగా ఉన్నారు. అరకు నియోజకవర్గంలో వైసిపి గడ్డు కాలంలో ఉన్నప్పుడు పార్టీకి జీవం పోసిన వైసిపి మాజీ సమన్వయకర్త, అరకు మాజీ ఎంపీపీ కార్తికో అరుణకుమారి, తన భర్త శెట్టి అప్పాలు 2024 సార్వత్రిక ఎన్నికల్లో అరకు అసెంబ్లీ నుంచి పోటీ చేయడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్లు కనిపిస్తోంది. ఇటీవల కాలంలో వైసిపి పెద్దలతో కలిసి విన్నవిస్తున్నట్లు ప్రచారం జోరందుకుంది.

వైసిపి ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి తీవ్రంగా కృషి చేశారు. గత కొద్ది రోజులు మౌనంగా ఉన్న అరుణకుమారి దంపతులిద్దరూ పార్టీకి చేసిన సేవలను ఇప్పుడు అధిష్టానం గుర్తించి టికెట్ ఇస్తే పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు పెదవి విప్పుతున్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు తమ భూములు విక్రయించి పార్టీ అభివృద్ధికి విశేష కృషిచేసిన మాజీ సమన్వయకర్త కార్తికో అరుణకుమారికి గాని, ఆమె భర్త శెట్టి అప్పాలుకు గాని టికెట్ కేటాయిస్తే వారికి న్యాయం చేసినట్లు అవుతుందని నియోజకవర్గం ప్రజలు చర్చించుకుంటున్నారు.

2010లో జగన్మోహన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసినప్పటి నుంచి ఆయనకు మద్దతుగా నిలిచారు. 2011లో జగన్ ఓదార్పు యాత్రలో శెట్టి అప్పాలు దంపతులు చురుకైన పాత్ర పోషించి ఆయా ప్రాంతాలలో జగన్ వెంట నడిచారు. జగన్ అరెస్ట్ అయి జైలుకు వెళ్లినప్పుడు కూడా నిరసనలు, ధర్నాలు చేయడంలో ప్రధాన పాత్ర పోషించారు.

2011 మార్చి 12న వైసిపి ఆవిర్భావం నుంచి కూడా మారుమూల ప్రాంతాల్లో సైతం భార్యాభర్తలిద్దరూ అవిశ్రాంతంగా తిరిగి వైసిపి జెండా ఆవిష్కరణలు చేస్తూ, వేలాదిమందిని పార్టీలోకి ఆహ్వానించి బలోపేతానికి కృషి చేశారు. 2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ అధిష్టానం అప్పట్లో కిడారి సర్వేశ్వరరావుకు టికెట్ ఇవ్వడంతో ఆయన గెలుపునకు శక్తివంచన లేకుండా కృషి చేశారు. ఆ ఎన్నికల్లో సర్వేశ్వరరావు 35 వేల ఓట్ల మెజార్టీతో గెలిపించడంలో కీలక పాత్ర పోషించారు.

2014లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మాడగడ సెగ్మెంట్ నుంచి ఎంపిటిసిగా అఖండ విజయం సాధించిన కార్తికో అరుణకుమారి అరకులోయ ఎంపిపిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనతి కాలంలోనే ప్రజల మన్ననలు పొందారు. 2014 ఎన్నికల్లో వైసిపి అధికారంలోకి రాకపోవడంతో ఆ పార్టీ నుంచి గెలుపొందిన అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు 2017లో టిడిపిలోకి వెళ్లిపోయారు. దీంతో వైసిపికి గడ్డుకాలం ఏర్పడింది. కార్తికో అరుణకుమారి పట్టువదలని విక్రమార్కుడిలా పార్టీకి అంటిపెట్టుకొని ఉండి జీవం పోసి పార్టీ బలోపేతానికి కృషి చేశారు. దీంతో పార్టీ వారి సేవలను గుర్తించి అరకు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించింది. అరకు నియోజకవర్గ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలతో మమేకమై పనిచేస్తున్న తరుణంలో ఎవరూ ఊహించని విధంగా కొన్ని పరిణామాలు చోటుచేసుకున్నాయి. బ్యాంకు ఉద్యోగిగా పని చేస్తూ రాజీనామా చేసి అప్పుడే కొత్తగా పార్టీలోకి వచ్చిన ప్రస్తుత ఎమ్మెల్యే చెట్టి పాల్గుణను సమన్వయకర్తగా నియమించారు. దీంతో నిరాశ నిస్పృహకు గురైన శెట్టి అప్పాలు దంపతులు పార్టీకి దూరమయ్యారు.

పార్టీని వీడి ఉండలేని శెట్టి అప్పాలు దంపతులు మళ్లీ వైసిపి ప్రాంతీయ సమన్వయకర్త వైవి.సుబ్బారెడ్డి సమక్షంలో పార్టీలోకి పున:ప్రవేశం చేసి ప్రభుత్వం నిర్వహించిన గడపగడప కార్యక్రమంలో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణతో కలిసి తిరిగారు. నువ్వే మా నమ్మకం జగనన్న కార్యక్రమాలలో కూడా పాల్గొన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేసిన మాజీ సమన్వయకర్త కార్తికో అరుణకుమారికి గాని, ఆమె భర్త శెట్టి అప్పాలుకుగాని అరకు నియోజకవర్గం అసెంబ్లీ టికెట్టు కేటాయిస్తే వైసిపి మరింత బలోపేతం అవుతుందని అరకు నియోజకవర్గ ప్రజలు చర్చించుకోవడం కనిపిస్తోంది.

ప్రగతి పథాన అల్లూరి జిల్లా

(మొదటి పేజీ తరువాయి..) వేస్తున్నారు. పాడేరు, అరకు ఆసుపత్రుల్లో వైద్యుల నియామకం, వైద్య పరికరాల కొనుగోలు వంటి పనులు చకచకా జరిగాయి. మరోపక్క రవాణాను సులభతరం చేసేందుకు ఏజెన్సీలో పలుచోట్ల జాతీయ రహదారులకు మోక్షం కలిగింది.

అల్లూరి జిల్లాలో 2022 ఏప్రిల్ 4 నుంచి సేవలు ప్రారంభమయ్యాయి. ఈ జిల్లా భౌగోళిక విస్తీర్ణం : 12,253 చదరపు కిలోమీటర్లు, రెవెన్యూ డివిజన్లు : పాడేరు, రంపచోడవరం, మండలాలు : 22, రెవెన్యూ గ్రామాలు : 2972, గ్రామ పంచాయతీలు : 430, గ్రామాలు : 4340, గ్రామ సచివాలయాలు : 352, పార్లమెంట్ : అరకు, అసెంబ్లీ నియోజకవర్గాలు : అరకు, పాడేరు, రంపచోడవరం, 2011 ప్రకారం జనాభా : 9.54 లక్షలు.

ఆంధ్రా ఊటీగా గుర్తింపు

తూర్పు కనుమల్లో ఆహ్లాదకరమైన ప్రకృతి అందం అరకులోయ, పాడేరు సొంతం. సముద్రమట్టానికి 3100 అడుగుల ఎత్తున గల అరకులోయ ఆంధ్రా ఊటీగా పేరుపొందింది. ప్రపంచ పర్యాటక రంగంలో అరకులోయ ఒకటిగా గుర్తింపు పొందింది. అందర్నీ ఆకర్షించే ఎన్నో ప్రకృతి అందాలు, జలపాతాలు అరకులోయ నియోజకవర్గంలో కొలువుదీరాయి. అరకులోయలో గిరిజన సంస్కృతి మ్యూజియం, కాఫీ మ్యూజియం, పద్మావతి బొటానికల్ గార్డెన్, బొర్రా గుహలు, మత్స్యగుండం, జోలాపుట్ జలాశయం, అనంతగిరి కాఫీ తోటలు అందర్నీ అమితంగా ఆకట్టుకుంటున్నాయి. డుంబ్రిగుడలో చాపరాయి జలపాతం, అనంతగిరిలో తాడిగుడ, కటికి జలపాతాలు, ముచ్చంగిపుట్‌లో భల్లుగుడ, డుడుమ జలపాతాలు, అరకులోయలో రణజిల్లెడ జలపాతం, (మిగతా 8లో..)

మనసుదోచే కాఫీ మ్యూజియం

- కమ్మని కాఫీతో పాటు విజ్ఞానం, వినోదం
- చాక్లెట్లు, తినుబండారాలూ లభ్యం
- పర్యాటకుల నిత్య సందర్శన
- ప్రతి శనివారం కాఫీ కార్నివాల్ డ్యాన్స్
- ఆకట్టుకునే హస్తకళలు



కాఫీ మ్యూజియం ముఖ ద్వారం


కాఫీ తయారు చేసే విధానం తెలియజేసే చిత్రాలు

ప్రజాశక్తి- అరకులోయ

అరకులోయ ప్రాంతంలో చూడదగిన ప్రదేశాల్లో కాఫీ మ్యూజియం (కాఫీహౌస్) ఒకటి. గిరిజన మ్యూజియానికి ఎదురుగా ఏర్పాటు చేసిన కాఫీ మ్యూజియం కాఫీ ప్రియులకు రుచికరమైన కాఫీ అందించడమే కాకుండా విజ్ఞానం, వినోదం పంచి పెడుతుందనడంలో ఎటువంటి సందేహం లేదు. అరకు వచ్చిన సందర్శకులు కాఫీ మ్యూజియాన్ని చూడకుండా వెళ్లరు. ఇక్కడ తయారయ్యే వివిధ రకాల ఆర్గానిక్ కాఫీలను తాగి పర్యాటకులు మంచి అనుభూతికి లోనవుతుంటారు.

కాఫీ ప్రదర్శనశాల

కాఫీ మ్యూజియంలో కాఫీని తయారు చేసి విక్రయించడమే వారి పని అనుకుంటే పొరపాటే. అరకు కాఫీ మ్యూజియంలో ప్రపంచ కాఫీ చరిత్రలో కాఫీ సంస్కృతి, సాంకేతిక కోణాలలో చారిత్రకంగా మరుగున పడిన పురాణ కథనాలు, కాఫీతో ఆరోగ్యం, సాగు, జీవావరణం, పోషణ మొదలగు ఆసక్తికరమైన విషయాలు తెలుసుకోవచ్చు. అంతే కాకుండా ఇథియోపియా నుంచి అరకు వరకు సాగిన కాఫీ ప్రస్థానాన్ని, గింజల సాగు మొదలుకొని పానీయం తయారీ వరకు జరిగే ప్రయాణాన్ని ఈ కాఫీ ప్రదర్శనశాల తెలియజేస్తోంది. అరకులోయ ఆదివాసీ రైతులు పండించిన కాఫీ గింజలను జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మలచడంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మందిని ఉత్తేజపరిచే అనేక ఉత్పత్తులు తయారయ్యే తీరును వీక్షించి, కాఫీ పరిమళాలను ఆస్వాదిస్తూ వీటి ఉత్పత్తులను కొనుగోలు చేయడం కాఫీ ప్రియులకు గొప్ప అనుభూతిని మిగిలిస్తోంది.

వివిధ రకాల కాఫీలు

కాఫీ మ్యూజియాన్ని ఏటా మూడు నుంచి నాలుగు లక్షల మంది పర్యాటకులు సందర్శిస్తుంటారు. ఇక్కడ వివిధ దేశాల కోల్డ్, హాట్ కాఫీలు తయారు చేసి విక్రయించడం ప్రత్యేకత. ఇందులో ఎథినిక్, అతంటిక్, అరేబిక, ఫీబేరి, కాఫీవిత్ ఇంటర్‌కాఫ్ ప్రెసెస్, ఎస్‌ప్రెసో, రెస్ట్‌రేటో, ఎస్‌పైసో కాన్‌ఫనా, మెకిఅటో, అమెరికెనో, మెక్సికెనో, వియానా, అపెగెటో, కెపిచునో, కెపిమొక, కెపెలెట్టే, గ్రీక్‌పాఫీచునో, ఐరీష్ కాఫీ, కాఫీ కైవాల్యం, కాఫీసోల్ వంటి 50 రకాల కాఫీలను ఇక్కడ తయారు చేసి విక్రయిస్తుంటారు. మొదట ఏడు దేశాలతో మొదలైన భారతీయ కాఫీ ప్రస్థానం, ఇప్పుడు 107 దేశాలకు భారత్ నుంచి ఎగుమతి అవుతుందని అరకులోయ కాఫీ మ్యూజియం నిర్వాహకులు తెలిపారు.

ప్రత్యేకంగా కాఫీ జర్నీ, విలేజ్

అరకులోయ కాఫీ మ్యూజియంలో కాఫీ జర్నీతో పాటు, కాఫీ విలేజ్‌ను కూడా రూపొందించి నర్సరీ, ప్లాంటింగ్, హార్వెస్టింగ్, పల్పింగ్, డ్రాయింగ్, క్యూరింగ్ చేసే విధానం కూడా తయారు చేసి సందర్శకులను ప్రత్యక్షంగా చూపించడం ప్రత్యేకత. ఆర్గానిక్ కాఫీ తయారీ విధానం చూసి వెంటనే తయారు చేయించుకుని కాఫీ తాగుతూ, మరపురాని అనుభూతికి లోనవుతారు.


కాఫీ మ్యూజియాన్ని సందర్శిస్తున్న పర్యాటకులు

కాఫీతో ఎన్నో ఉత్పత్తులు..

బొటానికల్ థీమ్ కాఫీ


కాఫీతో తయారు చేసిన వివిధ రకాల ఉత్పత్తులు


చాక్లెట్, కాఫీ ట్రుఫుల్స్, లిక్విడ్‌ఫిల్లింగ్ చాక్లెట్స్, చాక్లెట్ కవర్డ్ కాఫీబిన్స్ అండ్ నెట్స్, చాక్లెట్ బార్స్, లాలీపప్స్, చాక్లెట్ పడ్జ, కాకులేట్ బ్రౌనీ, మస్సేన్స్, చాక్లెట్ డొనర్స్, చాక్లెట్ ఫౌంటెన్, చాక్లెట్ డిప్స్, చాక్లెట్ మూజ్, కాఫీ హనీ చాక్లెట్స్, కాఫీ బగ్గర్లు, కాఫీ కేకులు తయారు చేసి విక్రయిస్తున్నారు. సుమారుగా 150 రకాల తిను బండారాలను స్థానిక ఆదివాసీ మహిళలలే ప్రత్యేకంగా శిక్షణ పొంది తయారు చేస్తున్నారు. కాఫీ మ్యూజియంకు వచ్చే పర్యాటకులను మరింతగా ఆకట్టుకొనే విధంగా ఆదివాసీ సంస్కృతిని ప్రతిభింబించే కళాకృతులతోనే ఫర్నీచర్స్‌ను రూపొందించారు. కాఫీ తోటలో పండే అంతర్ పంటల గింజల విక్రయం, ఐదు రకాల కాఫీ పొడులు కూడా తయారు చేసి సరసమైన ధరలకు విక్రయిస్తున్నారు. వివిధ దేశాల్లో కాఫీ తయారీకి ఉపయోగించే సామగ్రి, కాఫీ ఫిల్టర్, కాఫీ పెర్క్యులేర్, స్టావ్‌టాప్, ఎస్‌ప్రెసో, ఫ్రెంచ్ ప్రెస్, టర్కిష్ ఇబ్రిక్ పాట్ వంటి సామగ్రిలు కూడా విక్రయిస్తున్నారు.

కాఫీ కార్నివాల్ డ్యాన్స్

కాఫీ మ్యూజియంలో ఇక్కడకు వచ్చే వారిని వినోద పరిచేందుకు వీలుగా కాఫీ కార్నీవాల్ డ్యాన్స్ (థింసా)ను ప్రతి శనివారం ప్రదర్శింపజేస్తారు. కాఫీ అనేది కేవలం సేంద్రీయ ఎరువుతో ఉత్పత్తి కాదని గిరిజన సంస్కృతితో ముడిపడివుందని కాఫీ మ్యూజియం నిర్వాహకులు తెలిపారు. కాఫీ ప్రియులను దృష్టిలో పెట్టుకుని కాఫీ టైం స్నాక్స్, సాండ్ విజ్, కుక్కిస్, పేస్ట్‌రిస్, కేక్స్ తదితర వెరైటీలు తయారు చేసి విక్రయిస్తారు.

హస్తకళల ప్రదర్శన

ఇక్కడ ఆదివాసీ హస్తకళ ప్రదర్శన, విక్రయ కేంద్రం కూడా ఏర్పాటు చేశారు. ఇందులో వెదురు, చెక్క, జనపనార, లక్క, టెర్రకోట్, రాట్, హైరాన్, డ్వాక్రా క్రాఫ్ట్స్, ట్రైబల్ జువెలరీ, సంగీత వాయిద్యాలు సుమారు 200పైగా రకాల హస్త కళలు తయారు చేసి విక్రయిస్తున్నారు.


మ్యూజియంలో ఒక భాగం

పేపర్ కవర్లు

ఈ మ్యూజియంలో పాలథీన్ కవర్లకు చోటు లేదు. పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా కాఫీ మ్యూజియాన్ని నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఏ వస్తువు కొనుగోలు చేసినా పర్యావరణ హితమైన పేపర్లతో తయారు చేసిన కవర్ల (క్యారీ బ్యాగ్)తో వినియోగదారులకు ఇస్తున్నారు. కాఫీ గ్లాసులు కూడా అటువంటివే వాడతారు.

అరకు కాఫీ రుచిచూసిన ప్రధాని

అరకు కాఫీని భారత ప్రధాని నరేంద్ర మోడీ రుచి చూశారు. విశాఖలో జరిగిన ఫ్లీట్ రివ్యూకు వచ్చిన ఆయనకు ఆనాటి ఎపి సిఎం చంద్రబాబు అరకు ఆర్గానిక్ కాఫీ విశిష్టతను తెలిపి, కాఫీని తాగించారు. దీనికి ఆయన అరకు కాఫీ ఆమోఘమని ప్రశంసించినట్లు చంద్రబాబు చెప్పారు. ఎన్‌ఆర్‌ఇజిఎస్ ద్వారా కాఫీ సాగుపై అధ్యయనానికి వచ్చిన 11 రాష్ట్రాల ఐఎఎస్‌ల బృందం అరకులోయ కాఫీ మ్యూజియాన్ని ప్రశంసించింది. కాఫీతో తయారు చేసిన వివిధ ఉత్పత్తులు చూసి, ఆర్గానిక్ కాఫీ విశిష్టత తెలుసుకుని, వివిధ రకాల కాఫీ ఉత్పత్తులు విరివిగా కొనుగోలు చేశారు. శాసనసభ మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు, సిపిఎం రాష్ట్ర పూర్వ కార్యదర్శి పి.మధు, సినీ డైరెక్టర్ వంశీ తదితరులు సందర్శించారు. అరకులోయకు వచ్చే ఉన్నతాధికారులు, రాజకీయ నేతలు, మంత్రులు కాఫీ మ్యూజియాన్ని సందర్శించడం పరిపాటిగా మారింది.


అధికారులకు కాఫీ మ్యూజియం విశేషాలను తెలియజేస్తున్న నిర్వాహకులు

ఆదివాసీల సంస్కృతికి దర్పణం గిరిజన మ్యూజియం



మ్యూజియంలో ఆకట్టుకునే బొమ్మలు

సహజసిద్ధమైన ప్రకృతి అందాలకు నెలవు అరకు. అరకు ఆంధ్రా ఊటీగా ప్రసిద్ధి చెందింది. ఎత్తైన కొండలు, పాతాళాన్ని తాకేలా ఉన్న లోయలు, పచ్చదనాన్ని పరుచుకునే అడవులు, కొండల్ని కప్పేసిన మబ్బుతెరలు, గలగల పారుతూ కొండపైనుంచి జాలువారే జలపాతాలు ఇలా ఒక్కటేమిటి... ఇక్కడ ప్రతి ఒక్కటీ ప్రకృతి, పర్యావరణ ప్రేమికుల మనస్సును దోచే అందాలెన్నో కొలువుదీరి ఉన్నాయి. ఇలా పేరెన్నికగల సహజసిద్ధ సందర్శనా స్థలాలకు తోడు, గిరిజన జీవన వైవిధ్యానికి, సంస్కృతి, ఆచార వ్యవహారాలకు ప్రతిబింబించే కల్పిత అందాలకు కొదవేలేదు. అందులో ప్రముఖంగా చెప్పకోదగినది గిరిజన మ్యూజియం. ఎన్నో ప్రత్యేకతలను సంతరించుకున్న గిరిజన మ్యూజియానికి సంబంధించిన విశేషాలను తెలుసుకుందాం.

ప్రజాశక్తి - అరకులోయ

గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను, తరతరాల వారి జీవన విధానాన్ని భవిష్యత్తు తరాలకు తెలియజేప్పే లక్ష్యంతో 1996లో అరుకులో గిరిజన మ్యూజియాన్ని ఏర్పాటుచేశారు. సముద్ర మట్టానికి సుమారు 2500 అడుగుల ఎత్తున ప్రకృతి ఒడిలో ఈ మ్యూజియం ఉంది. ఆదివాసీల సాంస్కృ తిక పరిరక్షణ, వాటిని భావితరాలకు, ఇతర ప్రాంతం నుంచి వచ్చే పర్యాటకులకు తెలియ జెప్పడమే ధ్యేయంగా నాటి పాడేరు సమగ్ర గిరిజనా భివృద్ధి సంస్థ ప్రాజెక్టు ఆఫీసర్ సోమేష్ కుమార్ అప్పట్లో రూ.13 లక్షలతో దీన్ని నెలకొల్పారు. 1996 ఫిబ్రవరి 23న అప్పటి గవర్నర్ కృష్ణకాంత్ ప్రారంభించారు.

అనాదిగా గిరిజనులు వినియోగించిన, వినియోగిస్తున్న వివిధ రకాల పనిముట్లు, ఉపకరణాలు ఇక్కడ దర్శనమిస్తాయి. దీనిలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాలోని సవర, జాతాపు, భగత, కొండరెడ్డి, కోందు, వాల్మీకి, మన్నెందొర, మాలి, పూడి తదితర 23 తెగల గిరిజనులు తమ దైనందిన జీవితంలో ఉపయోగిస్తున్న వ్యవసాయ పనిముట్లు, వేటకు ఉపయోగించే వివిధ పరికరాలు, ఉపకరణాలు, సంప్రదాయ నృత్యాల్లో ఉపయోగించే వస్తువులు, గిరి మహిళల ఔన్నత్యాన్ని తెలిపే ఆభరణాలు తదితర ఎన్నో వస్తువులను ఇక్కడ భద్రపరిచారు. ఆదిమజాతి, ఇతర తెగలకు సంబంధించిన విశేషాలెన్నో ఇక్కడ కొలువుదీరాయి.

తొలి గిరిజన సంస్కృతి ప్రదర్శనశాల

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో గిరిజన సంస్కృతి ప్రదర్శనశాల ఇదే మొదటిది కావడం విశేషం. విశాఖపట్నానికి చెందిన చిత్రకారుడు వెంకట్ ఈ మ్యూజియం డిజైనింగ్, అంతర్విభాగాల రూపకల్పన చేశారు. ఈ మ్యూజియంలోని వివిధ అంశాలు గిరిజనుల జీవనశైలికి అద్దం పడతాయి. థింసా నృత్యం, తదితర అంశాలకు సంబంధించిన ఆకృతులు అక్కడ వాస్తవికతను కళ్లముందు సాక్షాత్కరింపజేయడమే కాకుండా, హఠాత్తుగా చూస్తూ నిజరూపాలేనన్న భ్రమను కలిగిస్తాయి.


ఆదివాసీల జీవనానికి దర్పణంగా నిలిచే ప్రతిమలు

ముఖద్వారంలోనే గిరిజన మ్యూజియం ప్రత్యక్షం

అరకులోయ మెయిన్ రోడ్డుకు ఆనుకుని గిరిజన మ్యూజియం ముఖద్వారం ఉంది. రైల్వే స్టేషన్ నుంచి సుమారు రెండు కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తే మ్యూజియాన్ని చేరుకోవొచ్చు. ప్రవేశ రుసుము ఈ ఏడాది ఆగస్టు 1వ తేదీ నుంచి పిల్లలకు రూ.30, పెద్దలకు రూ.60గా ఉంది. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మ్యూజియం తెరిచి ఉంటుంది. గిరిజన విద్యార్థులకు ప్రవేశం ఉచితం.

80 రకాల పరికరాలు భద్రం

మృదంగం, తుటును, సితార సూకి,



కిన్నెర, కొమ్ము బూర, పిల్లనగ్రోవి, సనోడు, నాదస్వరం, టొయిలీ, హిరజావ తదితర 80 రకాల పరికరాలను ఈ మ్యూజియంలో భద్రపరిచారు. గిరిజనులు వేట సమయంలో ఉపయోగించే పరికరాలను కూడా ఈ మ్యూజియంలో తిలకించవచ్చు. ఇంతవరకు చూడని గిరిజన సంప్రదాయ వస్తువులను ఈ మ్యూజియంలో పొందుపరిచారు.

సహజత్వం ఉట్టిపడే శిల్పాల ప్రదర్శన

గిరిజన మ్యూజియంలో రెండంతస్తుల విభాగంలో చూడచక్కని అర్చికలతో నిర్మితమైన శిల్పాల్లో సహజత్వం ఉట్టి పడుతుంది. మ్యూజియం మొదటి గదిలో వాయిద్య పరికరాలు, రెండో గదిలో వేటకు ఉపయోగించే సాధనాలు, మూడో గదిలో వ్యవసాయ పనిముట్లు, నాలుగో గదిలో గిరిజన నృత్యరీతులను తెలియజెప్పే మట్టిబొమ్మలు ఉన్నాయి. ఐదో గదిలో చూసిన వారు అక్కడి సహజత్వానికి ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురవుతారు. కొత్తగా చూసిన వారెవరైనా దానిని నిజమైన ఇల్లుగానే భ్రమిస్తారు. గిరిజన యువకుడు, ఇంట్లో సామగ్రి, గడ్డి, అచ్చం వాస్తవ దృశ్యాలను సాక్షాత్కరిస్తాయి. ఆ గదిలో గిరిజనుల వేషధారణ, జీవన పద్ధతులు, థింసా నృత్యం జీవం ఉట్టిపడేలా కనిపిస్తాయి. వివిధ తెగల గిరిజనుల వస్త్రధారణ రీతులనుచూడొచ్చు. మ్యూజియం ఆవరణలో చేతివృత్తిదారులు తయారుచేసిన వస్తువులు దొరుకుతాయి.

శ్రీకాకుళం ఏజెన్సీకి చెందిన సవరజాతి గిరిజనుల ఇళ్ల, గిరిజనులు జరుపుకునే పండగల్లో ఒకటైన గుడ్డుకొట్టే పండుగ, గిరిజనులకు సంబంధించిన నగల రూపాలు ఇక్కడ ఉన్నాయి. మ్యూజియానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని పర్యాటకులకు తెలియజెప్పడానికి బుక్‌లెట్‌లను ప్రచురించారు. కరోనాకు ముందు వరకూ ఏటా మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా జరిగిన అరకు ఉత్సవ్‌కు గిరిజన మ్యూజియమే వేదికగా నిలిచింది. గిరిజన ఉత్పత్తుల కళాకారులను పలువురిని గుర్తించి, వారిని ప్రోత్సహించి వారికి జీవనోపాధి కల్పించేందుకు ఈ మ్యూజియం ఉపయోగ పడుతోంది. పరిశోధకులకు కావాల్సిన సమాచారం కూడా ఈ మ్యూజియంలో దొరుకుతుంది.

ఎందరికో ఆర్థిక తోడ్పాటు

గిరిజన మ్యూజియంలో పది మంది గిరిజన యువతీ, యువకులు జీవనోపాధి పొందుతున్నారు. వీరితోపాటు వివిధ రకాల వస్తు విక్రయదారులు ఇక్కడ జీవనం సాగిస్తున్నారు. గిరిజన కళాకారులు తయారుచేసిన వస్తు ఉత్పత్తులను మ్యూజియం ఆవరణలోని షాపులో అమ్ముతారు. వెదురుతో తయారుచేసిన యాంకర్లు, స్టాండ్, ఫ్లవర్‌వాజ్‌లు, సబ్బు పెట్టెలు తదితర 40 నుంచి 50 రకాల వస్తువులు ఇక్కడ దొరుకుతాయి. మట్టితో తయారు చేసిన ఆకృతులు, దీపపు దిమ్మలు, జంతువులు, పక్షుల బొమ్మలు, ఇతర సంప్రదాయ వాయిద్యాలైన స్టాండ్, పెన్ స్టాండ్ ఇక్కడ లభిస్తాయి. వేటాడేందుకు తయారుచేసే బాణాలు, మట్టి బొమ్మలు, వాయిద్య పరికరాలను సేకరించి ఈ మ్యూజియం ద్వారా పర్యాటకులకు విక్రయిస్తున్నారు.


ఆదివాసీల సంప్రదాయ నృత్య ప్రతిమలు

సంప్రదాయ గిరిజన జీవనవిధానానికి ప్రతీక

మైదాన ప్రాంత సంస్కృతి ప్రభావం పడుతున్నప్పటికీ, ఇక్కడి గిరిజనులు తమ ఆచార వ్యవహారాలను విడనాడక, వాటిని మరింతగా పదిలపరచుకుంటూ ప్రకృతి ఒడిలో సంప్రదాయ జీవన విధానాన్ని కొనసాగిస్తున్నారు. మానవ ప్రస్థానం సాంస్కృతికంగా ఎక్కడ ప్రారంభమై ఎన్ని మలుపులు తిరిగి ఈ స్థాయికి చేరుకుందో తెలుసుకోవడానికి ఈ గిరిజన మ్యూజియం ఒక వేదికగా ఉందనడంలో అతిశయోక్తి లేదు.



వృత్తిలో నిమగ్నమైన గిరి మహిళల బొమ్మలు

నాడు - నేడుతో కళాశాలలకు కొత్త హంగులు



దుంబ్రిగుడ ప్రభుత్వ జూనియర్ కళాశాల

ప్రజాశక్తి -దుంబ్రిగుడ

దుంబ్రిగుడ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాడు -నేడు పథకం ద్వారా ప్రభుత్వం ఆధునికీకరణ చేపట్టారు. విద్యార్థులకు సౌకర్యాలను కల్పిస్తున్నారు. గతంలో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం నాడు- నేడు పథకం ద్వారా రూ.83 లక్షలతో విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు, తరగతి గదులు, ల్యాబ్, లైబ్రరీ సౌకర్యాలను ఏర్పాటుచేస్తున్నారు. 2022- 23 విద్యా సంవత్సరంలో ఈ కళాశాలలో విద్యార్థులు పరీక్ష ఉత్తీర్ణత శాతం బాగా పెరగడంతో ఈ ఏడాది 2023 -24 మొదటి సంవత్సరంలో విద్యార్థుల ప్రవేశాల సంఖ్య 250కి పెరిగింది. సిబ్బంది కూడా సరిపడా ఉన్నారు. ప్రత్యేక హాస్టల్ సౌకర్యం కల్పించడంతో విద్యార్థినీ, విద్యార్థులు నిత్యం కళాశాలకు ఆశక్తిగా వచ్చి విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థినిలకు ప్రత్యేక హాస్టల్ భవనాలు లేకపోవడంతో మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో హాస్టల్ సౌకర్యాన్ని అధికారులు ఏర్పాటుచేశారు. గతంలో ఈ కళాశాలలో విద్యార్థుల సంఖ్య తగిన విధంగా లేకపోవడంతో సిబ్బంది ఇబ్బంది పడేవారు. ఈ ఏడాదిలో భారీగా విద్యార్థుల ప్రవేశాలు జరగడంతో సిబ్బంది కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కళాశాల నూతన ప్రిన్సిపల్‌గా పార్వతి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది.


ప్రిన్సిపల్ పార్వతి

ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.పార్వతి ప్రజాశక్తితో మాట్లాడుతూ, ప్రస్తుతం కళాశాలలో మొదటి సంవత్సరంలో 240 మంది, ద్వితీయ సంవత్సరంలో 120 మంది ఉన్నారని చెప్పారు. ఈ ఏడాది మొదటి, ద్వితీయ సంవత్సరంలో సప్లిమెంటరీతో కలిపి మొత్తం 81.69 శాతం ఉత్తీర్ణత సాధించడంతో ప్రవేశాలు సంఖ్య పెరిగిందన్నారు. నాడు -నేడు పథకం ద్వారా రూ.83 లక్షలతో విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు, తరగతి గదులు, ల్యాబ్ సౌకర్యంతోపాటు తాగునీటి సౌకర్యం కూడా కల్పిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థినీ, విద్యార్థులకు 9 టాయిలెట్ గదులు, మూడేసి లెట్రిన్ గదులు చొప్పున నిర్మిస్తున్నామన్నారు. విద్యార్థినిలకు ప్రత్యేకంగా హాస్టల్ భవనాల సౌకర్యం ఏర్పాటు చేస్తే మరింత మంది బాలికలు ఇక్కడ చేసే అవకాశం ఉంటుందన్నారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేందుకు విద్యార్థులకు ప్రత్యేక తరగతులను కూడా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కళాశాల చుట్టూ ప్రహరీ నిర్మించడంతోపాటు ల్యాబ్ ఏర్పాటుచేయడానికి ప్రత్యేక గదులు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. కళాశాల అభివృద్ధికి సిబ్బందితో కలిసి పనిచేస్తున్నామని ప్రిన్సిపల్ చెప్పారు.


నాడు-నేడుతో నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్లు

ప్రగతి పథాన అల్లూరి జిల్లా

(5వ పేజీ తరువాయి..) హుకుంపేట మండలంలోని మత్స్యగుండం దేవాలయం, పెదబయలు మండలంలో ఎండ్రీ పర్వతం, పిట్ట బొర్రా, బొంగదాది జలపాతాలు ఇక్కడ చూపరులను ఆకట్టుకుని కనువిందు చేస్తూ, పర్యాటకులను ఆహ్లాదపరుస్తున్నాయి. అన్నింటికి మించి కెకె రైల్వే లైన్‌లో ట్రైన్ ప్రయాణం చెప్పలేని అనుభూతిని మిగుల్చుతుంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఏర్పాటు చేసిన తొలి జల విద్యుత్ కేంద్రంగా చరిత్ర పుటల్లో నిలిచిన మాచ్‌ఖండ్ విద్యుత్ కేంద్రం అరకు నియోజకవర్గం పరిధిలోనే ఉంది. మిగతా జిల్లాలతో పోల్చి చూస్తే అరకు, పాడేరుల్లో వర్షపాతం ఎక్కువ. అలాగే గోస్తని నది అనంతగిరి మండలంలోనే పురుడు పోసుకుంది. బొర్రా గుహల సమీపం నుంచే గోస్తని నది ప్రవహిస్తుంది. అరకు నియోజకవర్గం అటవీ ప్రాంతం విభిన్న రకాల జంతువులు, వృక్ష జాతులకు నిలయం. రోజ్‌వుడ్, తంగేడు, గుగ్గిలం, సిరమామిడి, ఏగిస, నల్లమద్ది, గంద్ర, వెదురు, టేకు, సిల్వర్ ఓక్ వంటి అనేక వృక్షజాతులు ఉన్నాయి. కాఫీ పంటకు అనువైన ప్రదేశం. అనంతగిరి మండలంలో మామిడి, అరటి, సీతాఫలాలు, పనస, కమల, బత్తాయి, జామ, వంటి విభిన్న రకాల పండ్లు, పదార్థాలు ఇక్కడ దొరుకుతాయి. అనంతగిరిలోని మర్దగుడ గ్రామం డ్రాగన్ ఫ్రూట్స్‌కు ప్రసిద్ధి. చింతపండు, మిరియాలు, జిగురు, అడ్డాకులు, అల్లం, పసుపు, విరివిగా దొరుకుతాయి. వివిధ ఔషధ మొక్కలు కూడా ఇక్కడి అడవుల్లో ఉన్నాయి. ఈ జిల్లాలో అపారమైన బాక్సైట్, కాల్‌సైట్, చైనా క్లే, లెటర్ రైట్ వంటి ఖనిజ నిక్షేపాలు ఉన్నాయి. రంగురాళ్లు కూడా ఇక్కడ దొరుకుతాయి. ఈ ప్రాంతంలో వాల్మీకి, భగత, కొటియా, కొండదొర, కొండ కాపు కొండ కుమ్మర, కోందు, పొర్జ గదభ తదితర గిరిజన తెగల ప్రజలు నివసిస్తున్నారు. వీరిలో కోందు, గదభ, పొర్జ తెగలు ఆదిమజాతి తెగలుగా గుర్తింపు పొందాయి. ఇక్కడ ప్రధాన జీవనాధారం వ్యవసాయం. రంపచోడవరం డివిజన్‌లోని విఆర్.పురం, చింతూరు, ఎటపాక, కూనవరం గోదావరి చెంత ఉన్నాయి. వరద, పోలవరం ప్రభావిత ప్రాంతాలుగా పిలవబడే ఈ మండలాల్లో ఇప్పటికీ గిరిజనులు అష్టకష్టాలు పడుతున్నారు. జిల్లా కేంద్రమైన పాడేరుకు పనుల నిమిత్తం రావాలంటే రోజుల తరబడి పడుతోంది. పైపెచ్చు జిల్లా యంత్రాంగం పర్యవేక్షణ కూడా ఆ విలీన మండలాలపై తగినంత లేదు.